ఆంధ్రజ్యోతి

andhrajyothy.com మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 44.4, కనిష్ఠం 28.7

నిజామాబాద్

జిల్లా వార్తలు

5

బుధవారం 23 ఏప్రిల్ 2025



● ఎండ తీవ్రతకు నిర్మానుష్యంగా మారిన నగర ప్రధాన రహదారి

రైతులు ఆధునిక పరిజ్ఞానాన్ని అలవర్చుకోవాలి



- కొత్త వంగడాలను సాగుచేయాలి
- ఎరువుల వాడకాన్ని తగ్గించాలి
- 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో రుద్రూర్ కృషి విజ్ఞాన కేంద్రం కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ అంజయ్య

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

నిజామాబాద్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రైతులు ఆధునిక పరిజ్ఞానాన్ని అవగాహన చేసుకొని, కొత్త వంగడాలను సాగుచేస్తూ పెట్టుబడి తగ్గిస్తూ అధిక దిగుబడులను సాధించాలని రుద్రూర్ కేవీకే కో ఆర్డినేటర్, వరి, చెరుకు పరిశోధన సంస్థ హెడ్ ప్రొఫెసర్ అంజయ్య తెలిపారు. రైతు మహోత్సవంలో భాగంగా గిరిరాజ్ కళాశాలలో 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో ఆయన పలు విషయాలు వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి: రైతు మహోత్సవంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం తరఫున రైతులకు ఏవిధమైన అవగాహన కల్పిస్తున్నారు?

కేవీకే కో ఆర్డినేటర్: రైతులు ఇంకా సంప్రదాయ పద్ధతులను పాటిస్తున్నారు. పెట్టుబడులు అధికంగా పెడుతున్నారు. పెట్టుబడి తగ్గించి దిగుబడులు పెంచే పద్ధతులపై ఈ రైతుమహోత్సవంలో రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. వ్యవసాయం, అనుబంధ రంగాలకు సంబంధించిన ఆధునిక పరికరాలను రైతులకు పరిచయం చేస్తున్నాం. వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని పరిశోధన కేంద్రాల్లో డెవలప్ చేసిన విత్తనాలను రైతులకు పరిచయం చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: వరి సాగులో రైతులు కొన్ని రకాల విత్తనాలనే ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. దీనివల్ల వారికి పెట్టుబడి భారీగా పెరుగుతోంది. విశ్వవిద్యాలయం తరఫున కొత్తవిత్తనాలను డెవలప్ చేశారా?

కోఆర్డినేటర్: రుద్రూర్, పొలాసతోపాటు ఇతర పరిశోధన సంస్థల్లో వరికి సంబంధించి కొత్త విత్తనాలను డెవలప్ చేశాం. ఈ విత్తనాలకు పెట్టుబడి తక్కువగా ఉండడంతో పాటు వేయడం వల్ల దిగుబడి కూడా ఎక్కువగా వస్తుంది. యాసంగిలో సాగుచేస్తే నూక శాతం కూడా తక్కువగా ఉంటుంది. ఆర్‌డీఆర్ 1200, ఆర్‌డిఆర్ 1162 విత్తనాలను రుద్రూర్ పరిశోధన కేంద్రం డెవలప్ చేసింది. ఈ ప్రాంతంలో ఉపయోగించే గంగ కావేరీలాగానే అధికంగా ఈ విత్తనాలు వేస్తే దిగుబడి వస్తుంది.

ఆంధ్రజ్యోతి: ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం చెరుగు సాగు తగ్గిపోయింది. మహారాష్ట్రలాగా చెరుకులో అధిక దిగుబడులు వచ్చే వంగడాలు ఇక్కడ దొరుకుతున్నాయా?

కోఆర్డినేటర్: ప్రస్తుతం చెరుకు సాగుచేస్తే వరికంటే ఎక్కువగా లాభాలు వస్తాయి. చెరుకు సాగులో అధిక దిగుబడులు వచ్చే వంగడాలు ఎక్కువగా వచ్చాయి. రుద్రూర్ పరిశోధన కేంద్రంలో అధిక దిగుబడిని ఇచ్చే 2013ఆర్81 రకాన్ని అందుబాటులో ఉంచాం. ఈ రకం సాగుచేస్తే ఎకరాకు 55నుంచి 60టన్నుల వరకు దిగుబడి వస్తుంది. చెక్కెర శాతం కూడా 19.45శాతం ఉంటుంది. ఇదే కాకుండా 2018ఆర్235, 2016ఆర్1 రకాలు ప్రస్తుతం పరిశోధన స్థాయిలో ఉన్నాయి. ఈ రకాలు చెరుకుకు వచ్చే ఎర్రకుళ్ల, కాటుకతెగుళ్ల, కాండం తొలిచే పురుగును తట్టుకుంటుంది. వరిసాగు కన్నా ఎక్కువ లాభాలు చెరుకుసాగుచేసే రైతులకు వస్తాయి.

ఆంధ్రజ్యోతి: ఉమ్మడి జిల్లా పరిధిలో రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా ఎరువులను వినియోగిస్తున్నారు. దీనివల్ల భూసారం దెబ్బతినదా?

కోఆర్డినేటర్: రాష్ట్రంలో ఏ జిల్లాలో వినియోగించనంత ఎరువులను ఈ జిల్లాలోని రైతులు వినియోగిస్తారు. మోతాదుకు మించి రైతులు నత్రజని ఎక్కువగా ఉన్న ఎరువులను వినియోగిస్తున్నారు. యూరియా, కాంప్లెక్స్ ఎరువులను ఎక్కువగా ఉపయోగించడం వల్ల భూముల్లో భాస్వరం నిల్వలు పేరుకుపోతున్నాయి. దీనివల్ల భూమిలోని భూసారం దెబ్బతింటుంది. భూముల్లో భాస్వరం నిల్వలు ఎక్కువగా ఉంటే పంటకు అవసరమైన సూక్ష్మ పోషకాలు అందవు. రైతులు అవసరం మేరకు మాత్రమే ఎరువులను ఉపయోగిస్తే మేలు జరుగుతుంది. మోతాదుకు మించి అధిక దిగుబడి కోసం ఎక్కువగా ఎరువులు వేయడం వల్ల భూమియొక్క సమతుల్యం దెబ్బతింటుంది.

ఆంధ్రజ్యోతి: భూమిలో భాస్వరం శాతం నివారించడంతో పాటు భూసారం దెబ్బతినకుండా ఎలాంటి చర్యలను తీసుకోవాలి?


కోఆర్డినేటర్: ప్రతిరైతు రెండు పంటలను సాగుచేస్తున్నారు. భాస్వరం నిల్వలు పెరిగిపోకుండా ఉండేందుకు పీఎస్‌బీ బ్యాక్టీరియాను ఉపయోగించడం వల్ల భాస్వరం శాతం భూమిలో తగ్గిపోతుంది. ఇది వీలుకాకపోతే వానకాలం పంటకు ముందే జనుము, జీలుగ, పిల్లిపెసర వేసి పంటవేసే సమయానికి ముందు దున్నితే భూమిలో భూసారం పెరుగుతుంది. భాస్వరం నిల్వలు తగ్గుతాయి. రైతులు భూసారాన్ని పెంచుకోకపోతే కొన్నేళ్లలో భూమిలో ఎరువుల శాతం పెరిగి పంటలు పండని పరిస్థితి ఎదురవుతుంది.

ఎండ ప్రచండం









- జిల్లాలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- పగలంతా భగ భగ.. రాత్రంతా ఉక్కపోత
- జిల్లాపై కొనసాగుతున్న వడగాలుల ప్రభావం
- అప్రమత్తంగా ఉండాలంటున్న అధికారులు
- మంగళవారం జిల్లాలో 44.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

జిల్లాలో మంగళవారం ఉష్ణోగ్రతలు ఇలా..

జిల్లాలోని మంచిప్పలో అత్యధికంగా 44.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆ తర్వాత మోర్తాడ్, నిజామాబాద్ రూరల్, కమ్మర్‌పల్లి, మాక్లూర్, ఎడపల్లిలో 43.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. నిజామాబాద్ సౌత్, మోస్రాలో 43.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయ్యాయి.

నిజామాబాద్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. కొద్ది రోజులుగా రికార్డు స్థాయిలో పగటి పూట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. పగలంతా భానుడి భగభగలు రాత్రంతా తీవ్రమైన ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. జిల్లాలో మంగళవారం జిల్లాలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 44.4డిగ్రీలుగా నమోదు కాగా, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 28.7 డిగ్రీలుగా నమోదయ్యాయి. గడిచిన వారం రోజులుగా పరిశీలిస్తే ఉష్ణోగ్రతలు పెరుగుతూ వస్తున్నాయి. ఈ నెల 13న ఉష్ణోగ్రతలు 40.5 డిగ్రీలు ఉండగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు 24.3గా నమోదయ్యాయి. అప్పటి నుంచి ప్రతిరోజూ కొంతమేర పెరుగుతూ 43 డిగ్రీలకు చేరింది. ఎండవేడిమి వలన ప్రజలు ఎవరూ బయటకు వెళ్లని పరిస్థితి ఏర్పడింది. అవసరం ఉంటే తప్ప ప్రజలు బయటకు రావడం లేదు. మండుతున్న ఎండల దాటికి చిరు వ్యాపారులు, రైతులు, ఉపాధి కూలీలు అల్లాడుతున్నారు. మధ్యాహ్నం 12దాటితే రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఎండ తీవ్రతతో ఉదయం నుంచే వడగాల్పులు పెరుగుతున్నాయి. సాయంత్రం 7గంటల వరకు ఈ గాలుల తీవ్రత ఉండడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వరికోతలు, ఇతర వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన రైతులు, వ్యవసాయ కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో ఎండ తీవ్రత పెరగడం వల్ల విద్యుత్ వినియోగం కూడా భారీగా పెరిగింది. జిల్లా వ్యాప్తంగా ప్రతి రోజూ 13.5మిలియన్ల యూనిట్‌ల వరకు విద్యుత్ వినియోగం అవుతుంది. వ్యవసాయానికి కొంతమేర డిమాండ్ తగ్గినా.. గృహ వినియోగానికి ఎక్కువ అయింది. ఫ్యాన్‌లు, కూలర్లు, ఏసీల వినియోగం పెరగడం వల్ల విద్యుత్ డిమాండ్ రోజురోజుకూ పెరుగుతోంది. అలాగే జిల్లాలో భూగర్భజలాలు వేగంగా పడిపోతున్నాయి. చెరువులు, కుంటలు, వాగులు, ప్రాజెక్టులు అడుగంటుతున్నాయి. ఎండల తీవ్రత పెరగడం వల్ల భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. చాలా ప్రాంతాల్లో భూగర్భ జలమట్టాలు భారీగా తగ్గిపోయాయి. బోర్లు ఎత్తిపోయాయి. రాబోయే వారం వరకు ఎండతీవ్రత పెరిగే అవకాశం ఉందని వాతావరణ పరిశోధన శాఖ అధికారులు తెలిపారు. అక్కడక్కడ అకాల వర్షాలు పడినా ఉష్ణోగ్రతలు మాత్రం తగ్గే అవకాశం లేదని వారు తెలిపారు. ప్రజలు వడదెబ్బల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. బయటకు వెళ్లేవారు తగిన జాగ్రత్తలు పాటించాలని కోరారు.

ఇంటర్ ఫలితాల్లో.. బాలికలదే హవా

Results



రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన కాకతీయ విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

- ఇంటర్ ఫలితాలలో సత్తా చాటిన జిల్లా బాలికలు
- 59.25 శాతం ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు
- ఇంటర్ ప్రథమ, ద్వితీయ ఫలితాలలో రాష్ట్రస్థాయిలో 25వ ర్యాంకులో జిల్లా
- కాకతీయ, ఉషోదయ, ఎస్ఆర్, నారాయణ, వెక్టర్ విద్యార్థుల హవా
- మే 22 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు



హర్షిత (ఉషోదయ)



పూజిత (ఉషోదయ)



సోఫా అకీల్ (కాకతీయ)



దొంతుల కీర్తి (ఎస్ఆర్)



వైష్ణవి (ఎస్ఆర్)

గత ఐదేళ్లలో జిల్లా ఉత్తీర్ణత శాతం ఇలా..

సంవత్సరం	ఫస్ట్ఇయర్	సెకండర్ ఇయర్
2021-22	58 శాతం	65 శాతం
2022-23	51 శాతం	60 శాతం
2023-24	49.95 శాతం	59.59 శాతం
2024-25	53.37 శాతం	58.21 శాతం

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ఫలితాలలో బాలికలదే హవా కొనసాగింది. మంగళవారం హైదరాబాద్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విడుదల చేసిన ఇంటర్మీడియట్ ఫలితాలలో మొదటి సంవత్సరం, ద్వితీయ సంవత్సరం ఫలితాలలో బాలికలు సత్తా చాటారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాలలో జిల్లావ్యాప్తంగా 15,056 మంది విద్యార్థులు పరిక్షలకు హాజరుకాగా 53.37 శాతం ఉత్తీర్ణతతో 8,035 మంది ఉత్తీర్ణత సాధించారు. ఉత్తీర్ణత శాతంలో జిల్లా రాష్ట్రస్థాయిలో 25వ స్థానంలో నిలిచింది. ద్వితీయ సంవత్సరం ఫలితాలలో జిల్లా విద్యార్థులు 58.21 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 13,945 మంది విద్యార్థులు పరిక్షలకు హాజరుకాగా 8,117 మంది ఉత్తీర్ణులయ్యారు. ఉత్తీర్ణతశాతంలో జిల్లా రాష్ట్రస్థాయిలో 25వ స్థానంలో నిలిచింది. ఒకేషనల్‌లో మొదటి సంవత్సరం 2,790 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 1223 మంది ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరం ఒకేషనల్ మొత్తం 2042 మంది పరిక్షలకు హాజరుకాగా 1231 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇంటర్ మొదటి సంవత్సరం, ద్వితీయ సంవత్సరం ఫలితాలలో బాలికలే పైచేయి సాధించారు. మొదటి సంవత్సరం ఫలితాలలో 8,074 మంది బాలికలు పరిక్షలు రాయగా 64.29 శాతం ఉత్తీర్ణతతో 5191 మంది ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరం ఫలితాలలోను మొత్తం 7,657 మంది బాలికలు పరిక్షలకు హాజరుకాగా 69.34 శాతం ఉత్తీర్ణతతో 5,309 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాలలో 6,982 మంది బాలురు పరీక్షలకు హాజరుకాగా 40.73 శాతం ఉత్తీర్ణతతో 2,844 మంది పాస్ అయ్యారు. ద్వితీయ సంవత్సరం ఫలితాలలో 6,288 మంది బాలురు పరిక్షలకు హాజరుకాగా 44.66 శాతం ఉత్తీర్ణతతో 2,808 మంది పాస్ అయ్యారు.

జిల్లా విద్యార్థులకు రాష్ట్ర స్థాయి ర్యాంకులు..

ఇంటర్ ఫలితాలలో జిల్లావ్యాప్తంగా ప్రైవేట్, ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు మరోసారి సత్తాచాటారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాలలో బోధన్ ఉషోదయ కళాశాలకు చెందిన విద్యార్థులు ఎం.హర్షిత 995/1000 (ఎంపీసీ), సీహెచ్ పూజిత 993/1000, ఎం.సాయిచరణ్ 992/1000, బైపీసీలో అయేషా జరీన్ 991/1000, మొదటి సంవత్సరం ఫలితాలలో కె.హర్షిత 468/470, బైపీసీలో ఖాన్సా బతూల్ 437/440 మార్కులు సాధించారు. నగరంలోని కాకతీయ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో సాఫా అఖిల్ 992/1000, త్రిషా చౌదరి 991/1000, బైపీసీలో అమ్తుల్ హాదీ మెహరిన 992/1000, జునైరా అంబర్ 992/1000, మొదటి సంవత్సరం ఫలితాలలో బి.కావ్యశ్రీ 467/470 (ఎంపీసీ), ఎం.హర్షిత 466/470, హనియా ఉమేమా 435/440 మార్కులతో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారు. ఎస్ఆర్ కళాశాలకు చెందిన విద్యార్థులు ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో దొంతుల కీర్తి 993/1000, పిట్టల సాయిశ్రీ 991/1000, జి.గౌతమ్ 991/1000, ద్వితీయ సంవత్సరం బైపీసీలో డి.వైష్ణవి 993/1000, తహూరా ఫాతిమా 992/ 1000, ప్రథమ సంవత్సరం ఎంపీసీలో ఏ.హర్షిణి 468/470, ఎన్.దినేష్ 468/470, శ్రీజ 468/470, జి.శ్రీనిధిరెడ్డి 468/470, బైపీసాలో ఎం.వైష్ణవి 438/440 మార్కులు సాధించారు. నగరంలోని నారాయణ కళాశాలకు చెందిన విద్యార్థులు ద్వితీ య సంవత్సరం ఎంపీసీలో అంబాటి శ్రావణి 993/1000, లవంగ వైష్ణవి 990/1000, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీలో గండ్ల వరుణ్ 468/470, బైపీసీలో అయేషా అఫిఫా 438/440 మార్కులు సాధించారు. నగరంలోని వెక్టర్ కళాశా లకు చెందిన విద్యార్థి నిశాంత్‌రెడ్డి ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో 991/1000 మార్కులు సాధించారు. ఇంటర్మీడియట్ ఫలితాలలో గత ఏడాదితో పోలిస్తే ఈ యేడాది ఉత్తీర్ణత శాతం ప్రథమ సంవత్సరం ఫలితాలలో కొద్దిగా పెరిగిన ద్వితీయ సంవత్సరం ఫలితాలలో తగ్గింది.

మిగతా 8వ పేజీలో...

రైతులకు ఆధునిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించేందుకే రైతు మహోత్సవం

● పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్



మాట్లాడుతున్న పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్

నిజామాబాద్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రైతులకు ఆధునిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించేందుకే రైతు మహోత్సవం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. నగరంలోని గిరిరాజ్ కళాశాల ఆవరణలో జరుగుతున్న రైతు మహోత్సవం కార్యక్రమానికి రెండో రోజు మంగళవారం ఆయన ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డితో కలిసి హాజరయ్యారు. తమది రైతు ప్రభుత్వమని రైతుల కోసం చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని ఆయన అన్నారు. రైతులకు కొత్త వంగడాలతో పాటు యాంత్రీకరణపై అవగాహన కల్పించేందుకే ఉమ్మడి జిల్లా పరిధిలో దీనిని ఏర్పాటు చేశామన్నారు. దాన్యాగారంగా పేరున్న జిల్లాకు మళ్లీ పూర్వ వైభవాన్ని తీసుకువచ్చేందుకే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శాస్త్రవేత్తలు, వ్యవసాయ, అనుబంధ రంగాలకు చెందిన అధికారులతో పాటు వివిధ పరిశ్రమలకు సంబంధించిన వారు ఇక్కడికి వచ్చారన్నారు. విత్తనాలు, ఎరువులు, యాంత్రీకరణ పరికరాలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తున్నారని ఆయన అన్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన వ్యవసాయ అధికారులు తప్పనిసరిగా ప్రతిరోజు ఫీల్డ్‌లో ఉండి రైతులకు కొత్త పద్ధతులపై అవగాహన కల్పించాలన్నారు. పెట్టుబడి తగ్గించడంతో పాటు దిగుబడి పెంచే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు పక్షపాతి అని, రైతులకు ఇచ్చిన అన్ని హామీలను అమలు చేస్తున్నారని ఆయన అన్నారు. వ్యవసాయం, ఉద్యానవనం, పట్టుపరిశ్రమ, పాడిపరిశ్రమ, మత్స్య పరిశ్రమ రంగాల్లో వస్తున్న ఆధునిక పోకడలను గమనిస్తే రైతులకు మేలు జరుగుతుందన్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టును నిజాం నవాబు నిర్మించాడన్నారు. ఆనాడు ఆ ప్రాజెక్టు చేపట్టడం వల్ల జిల్లా సస్యశ్యామలంగా మారిందన్నారు. ఆ ప్రాజెక్టులో పూడిక తీసి లక్షన్నర ఎకరాలకు సాగు నీటిని అందిస్తామని ఆయన అన్నారు. ఈ ప్రాజెక్టుతో పాటు ఎస్సారెస్పీలో కూడా పూడికతీత పనులు చేపట్టి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఈ ప్రాజెక్టు పరిధిలో మరో రెండులక్షల ఎకరాలకు అదనపు సాగునీటిని అందించే విధంగా కృషిచేస్తామన్నారు. కాంగ్రెస్ హయాంలో చేపట్టిన ప్రాణహిత, చేవెళ్ళ ప్యాకేజీలు 20, 21, 22 పనులను పూర్తిచేస్తామన్నారు. మూడు రోజులపాటు జరిగే ఈ రైతు మహోత్సవం కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని కోరారు. ప్రభుత్వం రైతుల కోసమే ఈ మహోత్సవం కార్యక్రమాన్ని జిల్లాలో ఏర్పాటు చేసిందని మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే పి. సుదర్శన్ రెడ్డి అన్నారు. రైతుల కోసమే ముఖ్యమంత్రిని ఒప్పించి జిల్లాకు తీసుకువచ్చామన్నారు. రైతులు పెద్దసంఖ్యలో వచ్చి ఈ సమాచారంపై అవగాహన

మిగతా 8వ పేజీలో...

ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ప్రాంతంలో ఎకోటూరిజం

● ఫారెస్ట్ చీఫ్ కన్జర్వేటర్ చంద్రశేఖర్‌రెడ్డి

8





8

కుటుంబ సభ్యులతో సాయిచైతన్య జాదవ్

తండ్రి హెడ్‌కానిస్టేబుల్.. కొడుకు ఐపీఎస్ !

- డిచ్‌పల్లి హెడ్‌కానిస్టేబుల్ కుమారుడు సాయి చైతన్యకు సివిల్స్‌లో 68వ ర్యాంకు
- ప్రత్యేకంగా అభినందించిన రాష్ట్ర డీజీపీ, సీపీ

భూభారతితో భూసమస్యలకు శాశ్వత పరిష్కారం



మెండోరలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ కిరణ్‌కుమార్

మెండోర, ఏప్రిల్22(ఆంధ్రజ్యోతి):భూభారతి పోర్టల్‌లో భూసమస్యలకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందని జాయింట్ కలెక్టర్ కిరణ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకువచ్చిన తెలంగాణ భూభారతి భూమి హక్కుల చట్టంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ధరణి సమయంలో భూముల సమస్యలు పరిష్కారం జరుగక రైతులు కార్యాలయాల చుట్టు తిరిగేవారని రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ కొత్తచట్టం భూభారతి ద్వారా రైతులకు సౌలభ్యం ఏర్పడిందన్నారు. సక్సెషన్ విషయంలో సైతం ధరణిలో అప్లైషన్‌కు అవకాశం లేదని భూభారతిలో చేసుకోవచ్చన్నారు. సక్సెషన్ మ్యూటేషన్ కోసం దరఖాస్తుదారులు దరఖాస్తు చేసుకున్న 30 రోజుల్లో తహసీల్దార్ విచారణ చేసి మ్యూటేషన్ చేయాలని లేకపోతే 31వ రోజు ఆటోమేటిక్‌గా మ్యూటేషన్ అవుతుందన్నారు.భూభారతి చట్టం ద్వారా 90శాతం రైతుల భూసమస్యలకు పరిష్కారం ఇక్కడే జరుగుతుందని 10శాతం మాత్రం ఆర్డీవో కలెక్టర్ స్థాయిలో ఉంటాయన్నారు. రైతులు భూభారతి చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నూతన చట్టానికి సంబంధించి ప్రభుత్వం రూపొందించిన మార్గదర్శకాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సంతోష్‌రెడ్డి,ఎంపీడీవో వనజ,వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డి, సొసైటీ చైర్మన్ రాజారెడ్డి, ఆర్ఐ వేణుగోపాల్,చారి,రైతులు పాల్గొన్నారు.

జిల్లా న్యాయాధికారిగా జీవీఎస్ భరతలక్ష్మీ



న్యాయాధికారికి పుష్ప గుచ్ఛం అందజేస్తున్న బార్ సభ్యులు

నిజామాబాద్ లీగల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి):జిల్లా ప్రధాన న్యాయాధికారిణిగా జీవీఎస్ భరతలక్ష్మి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. హైదరాబాద్‌లోని లేబర్ కోర్టులో ప్రిసైడింగ్ ఆఫీసర్ విధులు నిర్వర్తిస్తున్న ఆమె బదిలీపై జిల్లా ప్రధాన న్యాయాధికారిణిగా వచ్చారు. మంగళవారం తన ఛాంబర్‌లో జిల్లా బార్ అసోసియేషన్ అధక్షులు మామిళ్ల సాయిరెడ్డి, కార్యదర్శి మాణిక్ రాజు మర్యాదపూర్వకంగా కలిశా రు. అలాగే పలువురు జిల్లా న్యాయవాదులు కూడా ప్రధాన న్యాయాధికారిని కలిశారు

● జిల్లా ప్రధాన న్యాయాధికారిని కలిసిన సీపీ

నిజామాబాద్ అర్బన్: జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించిన భరతలక్ష్మిని మంగళవారం పోలీస్ కమిషనర్ సాయిచైతన్య కోర్టు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు మొక్కను అందజేశారు. జిల్లా న్యాయాధికారిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆమెకు స్వాగతం పలుకుతూ అభినందనలు తెలిపారు.

ప్రధానోపాధ్యాయులతో సబ్ కలెక్టర్ సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ వికాస్ మహతో

బోధన్‌రూరల్,ఏప్రిల్22(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణ, మండల ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో మంగళవారం తెలుగు, ఉర్దూ మాధ్యమాల ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ఉప విద్యాశాఖ అధికారి కార్యాలయంలో మంగళవారం సబ్ కలెక్టర్ వికాస్ మహతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ నెలలో నిర్వహించిన బేస్ లైన్ పరీక్ష ఫలితాలలో అక్టోబర్ నెలలో నిర్వహించిన మిడ్ లైన్ పరీక్ష ఫలితాలు, మార్చిలో నిర్వహించిన ఎండ్ లైన్ పరీక్షలలో వచ్చిన విద్యార్థుల ఫలితాల వివరాలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో నాగయ్య, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రత్నాకర్, ఆరీఫోద్దీన్, స్వరూప, సీఆర్‌పీలు విజయ్, యూసుఫ్, బాబు, విజయ్, రేఖ, శివానంద్, దేవానంద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న రీజనల్ మేనేజర్ జోత్స్న

ఆర్మూర్ రూరల్, ఏప్రిల్22(ఆంధ్రజ్యోతి): ప్రజలు ఆర్టీసీ సేవలు వినియోగించుకొని ఆర్టీసీ బస్సులలోనే ప్రయాణం చేయాలని రీజనల్ మేనేజర్ జాస్నా అన్నారు. ఆర్మూర్ మండలం అంకాపూర్‌లో మంగళవారం గ్రామ కమిటి, గ్రామ ప్రజలతో ప్రయాణీకుల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎం మాట్లాడుతూ మహాలక్ష్మీ పథకం ద్వారా మహిళలకు ఉచిత ప్రయాణంతో ఆర్టీసీపై ఆదరణ పెరిగిందని అదేవిధంగా పురుషులు కూడా ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణం చేయాలన్నారు. తమ సంస్థ ఆధ్వర్యంలో ముందస్తు టికెట్ బుకింగ్ సౌకర్యం నిజామాబాద్ రీజియన్‌లో కార్గో పార్శిల్ సేవలతో పాటు పెళ్లిలు శుభకార్యాలకు అద్దె బస్సుల సౌకర్యం కలిస్తున్నామన్నారు. ప్రయాణీకులు ఆర్టీసీ బస్సులోనే ప్రయాణించి సురక్షి తంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని రీజనల్ మేనేజర్ జోస్నా కోరా రు. సమావేశంలో డిప్యూటి రీజనల్ మేనేజర్ మధుసుదన్, ఆర్మూర్ ఆర్టీసీ డీఎం రవికుమార్, ఉద్యోగులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

నందిపేట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తల్వేద, చౌడమ్మ కొండూర్ గ్రామాలలో మంగళవారం బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును నిజామాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెంట ఇంద్రుడు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంద మహిపాల్ అందజేశారు. అనారోగ్యంతో బాధ పడుతున్న బాధితురాలు సంతోళ్ళ చంద్రవ్వకు రూ.60వేల చెక్కును, అలాగే గంగనోళ్ళ దీపకు రూ.17వేలు చెక్కులను ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం పంపిణీ చేశారు. సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల మంజూరుకు కృషి చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆర్మూర్ నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ పొద్దుటూరి వినయ్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేవిదాస్ గౌడ్, సంజీవ్, ఏర్రోళ్ల రవి, గంగసాయిలు, గంగయ్య, మెండు శ్రీకాంత్, గొల్ల మల్లేష్, చిరంజీవి, చోటు తదితరులు ఉన్నారు.

దేశానికి తెలంగాణ రోల్‌మోడల్‌గా మారింది

● పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్



మాట్లాడుతున్న పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్

నిజామాబాద్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : దేశానికి తెలంగాణ రోల్ మోడల్‌గా మారిందని.. రాష్ట్రంలో అమలవుతున్న అభివృద్ధి పథకాలపై దేశవ్యాప్త చర్చ జరుగుతోందని పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. మంగళవారం నిజామాబాద్‌లోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రైతుల శ్రేయస్సును గాలికి వదిలేశారని, రైతులకు బీఆర్ఎస్ నేతలు చేసింది శూన్యమన్నారు. అలాంటి ఆ పార్టీ నేతలు ప్రస్తుతం రైతుల గురించి మాట్లాడుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో రైతులు వరికుప్పల మీద ప్రాణాలు వదిలిన ఘటనలను ఇంకా ప్రజలు మరిచిపోలేదన్నారు. రైతులకు బేడీలు వేసి నడిపించిన ఘటనలు వారి పాలనలో ఎన్నో ఉన్నాయన్నారు. రైతుల మీద లాఠీ చార్జీ చేసిన ఘటనలు బీఆర్ఎస్ పాలనలో కొనసాగాయన్నారు. ప్రధాని నరేంద్రమోదీ రైతులకు వ్యతిరేకంగా నల్లచట్టాలు తెచ్చి వారిని కష్టాల పాలు చేస్తుంటే బీఆర్ఎస్ ప్రభుత్వం మద్దతు పలికిందన్నారు. ఆ విషయాన్ని రైతులు ఇప్పటికీ మరిచిపోలేదన్నారు. రైతు వ్యతిరేక చట్టాలను కేంద్రం వెనక్కు తీసుకునే విధంగా కాంగ్రెస్ పార్టీ పెద్ద ఉద్యమమే చేసిందన్నారు. బీఆర్ఎస్ మనుగడ కోసం మాత్రమే రజతోత్సవ సభను నిర్వహిస్తున్నారని, అలాంటి వారిని పట్టించుకునే పరిస్థితుల్లో ప్రజలు లేరన్నారు. ఆ పార్టీకి జనంలో ఆదరణ లేదన్నారు. కేసీఆర్, కేటీఆర్ పదేళ్లలో జనానికి చేసింది శూన్యమన్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీతో లోపాయికారీగా ఒప్పందం చేసుకొని ఒక్కసీటు కూడా సాధించలేదన్నారు. ఈ విలేకరుల సమావేశంలో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, కార్పొరేషన్ చైర్మన్లు మానాల మోహన్ రెడ్డి, తాహెర్ బిన్ హుందాన్, డీసీసీబీ చైర్మన్ కుంట రమేష్ రెడ్డి పాల్గొన్నారు.

మత్తు పదార్థాల సరఫరాపై ఉక్కుపాదం మోపాలి

● బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి



రివ్యూ సమావేశంలో ఎక్సైజ్ పోలీసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

బోధన్‌రూరల్,ఏప్రిల్22(ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాల సరఫరాపై ఎక్సైజ్ పోలీసులు, పోలీసులు ఉక్కుపాదం మోపాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. మంగళవారం బోధన్ పట్టణంలోని ప్రొబిషన్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ పోలీసులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా అవగాహన కార్యక్రమం నిర్వహించాలన్నారు. మత్తు పదార్థాలు సరఫరా చేసే వారిపై ప్రత్యేక నిఘా ఉంచి మత్తు పదార్థాలు సరఫరా కాకుండా చూడాలన్నారు. మత్తు పదార్థాలు సరఫరా చేసే వారిపై కఠిన చర్యలు చేపట్టి జైలుకు పంపాలన్నారు. యువత మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా చూడాల్సిన బాధ్యత ఎక్సైజ్ పోలీసులపైనే ఉందన్నారు. మత్తు పదార్థాల సరఫరా అడ్డాలు, నిల్వ చేసే చోట్లను ప్రత్యేకంగా ఒక టీమ్ ఏర్పాటు చేసి వాటిని గుర్తించి మత్తు పదార్థాల రవాణాను అరికట్టాలన్నారు. మత్తు పదార్థాల సరఫరాపై ఉక్కుపాదం మోపి యువతను కాపాడాల్సిన బాధ్యత ఎక్సైజ్ పోలీసులపై ఉందన్నారు. అద్దె భవనంలో కొనసాగుతున్న ఎక్సైజ్ కార్యాలయం శిథిలావస్థకు చేరడంతో పాత రోడ్లు భవనాల అతిథి గృహంలోకి ఎక్సైజ్ కార్యాలయాన్ని మార్చారు.

● పోటీ పరీక్షల కోసం సిద్ధమవుతున్న యువత

పోటీ పరీక్షల కోసం సిద్ధమవుతున్న నిరుద్యోగ యువత గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. బోధన్ గ్రంథాలయాన్ని అదనంగా నిర్మించిన గదులను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, నిరుద్యోగ యువతతో మాట్లాడారు. సమస్యలు ఉంటే తెలిజేయాలని కోరారు. ఏకాగ్రతతో చదివి లక్ష్యాన్ని సాధించాలని పేర్కొన్నారు. నిరుద్యోగ యువతకు అవసరమైన వనరులు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఉద్యోగ అవకాశాలు కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనన్నారు. గ్రంథాలయాలు ఆధునిక దేవాయాలు అని గ్రంథాయాలలో పోటీ పరీక్షలకు అవసరమయ్యే మరి కొన్ని పుస్తకాలను కల్పిస్తామన్నారు. నిరుద్యోగ యువత వాటిని సద్వినియోగం చేసుకుని ఉద్యోగాలు సాధించాలన్నారు.

● సొంతింటి కలను నెరవేరుస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీదే..

సొంత ఇంటి కలను నెరవేరుస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీదేనని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. మంగళవారం బోధన్ పట్టణంలోని 10, 11, 15 వార్డుల్లో ఎమ్మెల్యే పర్యటించారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న ఇళ్లు లేని నిరుపేదల వివరాలు తెలుసుకుని వారితో మాట్లాడారు. దరఖాస్తు చేసుకున్న లబ్దిదారులకు సొంత స్థలం,ఇళ్లు నిర్మించుకునేందుకు ఉన్నదా లేదా అనే అంశంపై ఆరా తీశారు. వారి ఆర్థిక పరిస్థితులపై వాకబు చేసి ఇళ్లు నిర్మించుకునేందుకు ఆసక్తి ఉందా అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వం 5సంవత్సరాలుగా బోధన్‌లో ఒక్క ఇంటిని కూడా అందించలేదన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు సొంతింటి కలను ఇళ్లు నిర్మించుకుని లబ్దిపొందాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ పోలీసు అధికారులు మల్లారెడ్డి, డీసీ సోమిరెడ్డి, సీఐ బాస్కర్ రావు, సబ్ కలెక్టర్ వికాస్ మహతో, ఏసీపీ శ్రీనివాస్, తహసీల్దార్ విఠల్, పట్టణ సీఐ వెంకట నారాయణ, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హుందాన్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్, నాగేశ్వర్ రావు, శరత్ రెడ్డి, దాము, హరికాంత్ చారి, పోల్, అల్లె రమేష్, సంజీవ్ రెడ్డి, గుండెటి శంకర్, తలారి నవీన్, జహీర్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంపల్లి ఎల్లమయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులున్నారు.

ఘనంగా లెనిన్ జయంతి ఉత్సవాలు



నందిపేటలో లెనిన్ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న నాయకులు

నందిపేట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మంగళవారం సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా ఆధ్వర్యంలో లెనిన్ 155వ జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు కె.గంగాధర్ లెనిన్ చిత్ర పటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ఆయన మాట్లాడుతూ 1870లో రష్యాలోని సింబర్స్క్ పట్టణంలో జన్మించిన లెనిన్ సోషలిస్ట్ విప్లవం సాధించారని తెలిపారు.మార్క్స్, ఎంజెల్స్ రచనలు అధ్యాయనం చేసి బడుగు, బలహీన వర్గాలను ఏకం చేసి రష్యాలో విప్లవం సాధించినట్లు గంగాధర్ పేర్కొన్నారు.గతంలో ప్రపంచంలోని మూడో భూభాగంలో కార్మికుల అనుకూల రాజ్యాలు నిలిచాయని, చైనా,రష్యా ఇంకాఎన్నోదేశాల్లో కార్మికులు, కర్షకులు, మహిళలు పోరాటాల ద్వారా ప్రభుత్వాలు ఏర్పాటు చేసుకున్న సంఘటనలను కె.గంగాధర్ గుర్తు చేశారు.ఈకార్యక్రమంలో నాయకులు సాయరెడ్డి, దేవన్న, నాగరాజు, కృష్ణ ప్రసాద్, సనత్‌కుమార్, రాకేష్,రాజేశ్వర్, బోజేందర్, ఫరీద్ తదితరులు ఉన్నారు

బోధన్‌రూరల్: ప్రపంచ ప్రథమ సోషలిస్టు రాజస్థాపకుడు లెనిన్ 150వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించినట్లు సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా నాయకులు మల్లేష్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడ దోపిడి, పీడన ఉన్న అంత వరకు శ్రామిక వర్గాల ప్రజలను దేశ కాలాలకు అతీతంగా ఆయన స్ఫూర్తిదాయకంగా ఉంటారని పేర్కొన్నారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్, ప్రజా సంఘాల నాయకులు పోశెట్టి, నాగమణి, అబ్బయ్య, శ్రీను, దశరథ్, కబీర్ ఖాన్, సాయిలు, పోశెట్టి, గంగామణి, లక్ష్మి, సావిత్రి, లింగామణి తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు దొంగల అరెస్టు

నవీపేట,ఏప్రిల్22(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మారం శివారులో ఈ నెల 18న రోడ్డు పక్కన ధాన్యం ఆరబోసి చెట్టు కింద కూర్చున్న అదే గ్రామానికి చెందిన ఓ మహిళ మెడలో నుండి ఇద్దరు యువకులు బైక్‌పై వచ్చి మంగళ సూత్రాన్ని బలవంతంగా లాక్కెళ్లారని ఎస్ఐ వినయ్ తెలిపారు. నిందితులైన ఇద్దరు యువకులు ఎడపల్లి మండల ఏఆర్‌పీ క్యాంప్‌కు చెందిన సాయి కుమార్, పవన్ కళ్యాణ్ అనే ఇద్దరిని మంగళవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. వీరి వద్ద నుండి బైక్, రెండు బంగారు పుస్తెలు, నాలుగు బంగారు గుండ్లను రికవరీ చేయడం జరిగిందని ఎస్ఐ వివరించారు. మహిళలు, యువతులు బంగారు ఆభరణాలను ధరించి బయటకు వెళ్లిన సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్ఐ కోరారు.

గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి

కోటగిరి,ఏప్రిల్22(ఆంధ్రజ్యోతి): గర్భిణీలు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని తహసీల్దార్ తారాబాయి సూచించారు. రుద్రూరు మండల కేంద్రంలోని సమీకృత మండల సముదాయ కార్యాలయంలో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు, పిల్లలు తీసుకోవాల్సిన ఆహారంపై అవగాహన కల్పించారు.పోషక విలువలతో కూడిన ఆహారం ప్రతిరోజు తీసుకోవాలన్నారు.గర్భందాల్చిన రోజు నుంచి బిడ్డపుట్టిన రెండు సంవత్సరాల వరకు వెయ్యి రోజులు గోల్డెన్ డేస్ అని పేర్కొన్నారు. అనంతరం పలువురు చిన్నారులకు అన్నప్రాసన, గర్భిణులకు సీమంతాలు చేశారు.ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త శ్వేత, హెల్త్ సూపర్‌వైజర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు పాల్గొన్నారు.

డ్రగ్స్ నిర్మూలనకు డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీ

బోధన్‌రూరల్,ఏప్రిల్22(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని బస్టాండ్, శక్కర్‌నగర్ చౌరస్తా పలు హోటళ్లు, కళాశాలలు, పాన్ షాప్‌లలో సీపీ ఆదేశాల మేరకు డాగ్‌స్క్వాడ్‌తో ఆకస్మికంగా తనిఖీ చేయడం జరిగిందని బోధన్ పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. మంగళవారం సీపీ ఆదేశాల మేరకు యాంటీ నార్కోటిక్ డ్రగ్స్ నిర్మూలనలో భాగంగా అసాంఘిక కార్యకలాపాలు కట్టడిలో భాగంగా డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు చేయడం జరిగిందని వివరించారు.

ఇందూర్ బీఈడీ కళాశాలలో జాబ్‌మేళా

బోధన్‌రూరల్,ఏప్రిల్22(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని ఇందూర్ బీఈడీ కళాశాలలో మంగళవారం జాబ్‌మేళా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఇందూర్ విద్యాసంస్థల చైర్మన్ కొడాలి కిషోర్ కుమార్ తెలిపారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగఅవకాశాలు కల్పించడమే ధ్యేయంగా జాబ్‌మేళా కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు.హెచ్‌డీఎఫ్‌సీ, ఏఎక్స్‌ఐఎక్స్ బ్యాంకుల అధికారులు వివిధ కళాశాలల నుండి వచ్చిన 200మంది విద్యార్థులలో 17మందిని ఉద్యోగులుగా ఎంపిక చేశారని ఆయన వివరించారు.ఈకార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మదన్ మోహన్, అప్పాల నాయుడు, టాస్క్ నిర్వాహకులు హన్మంత్ పాల్గొన్నారు.

మహనీయుల జయంతోత్సవాల కరపత్రాల ఆవిష్కరణ

రెంజల్,ఏప్రిల్22(ఆంధ్రజ్యోతి): ఈ నెల 30న బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో నిర్వహిస్తున్న మహనీయుల జయంతోత్సవాల కరపత్రాలను ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ కమిటీ కన్వీనర్ ఈశ్వర్ ఆవిష్కరించారు. సోమవారం మండలంలోని నీలా, పేపర్‌మిల్, కందకుర్తి, సాటాపూర్ గ్రామాలలో స్థానిక నాయకులతో కలిసి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ కమిటీ కోకన్వీనర్ సీరడి రవి, సింగడే పాండే, మాల మహనాడు జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్, సిద్ధ ప్రభాకర్, పాల్గొన్నారు.

హత్య కేసులో ఒకరికి జీవిత ఖైదు

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్ 22:(ఆంధ్రజ్యోతి):ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి గ్రామానికి చెందిన దండుగుల తిరుమల్‌కు హత్యకేసులో జీవితఖైదు, వెయ్యి రూపాయల జరిమాన విధిస్తు మంగళవారం నిజామాబాద్‌లోని మహిళ అడిషనల్ సెషన్స్ జడ్జి పి. శ్రీనివాస్ తీర్పునిచ్చారు. బిక్నూర్ భగబట్టి రాజయ్య తన కూతురు చంద్రకళను 2007 మే 8న పొరిగింటి వారితో గడవ జరగగా తన కూతురిని దండుగుల తిరుమల్ ఆయన భార్య సావిత్రిలు కలిసి గొడ్డలితో తలపై కొట్టి హత్య చేశారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి సీఐ బస్వారెడ్డి కేసు నమోదు చేశారు. బాధితుల తరపున పబ్లిక్ ప్రాసికుటర్ వసంత్‌రావు వాదనలు వినిపించగా ఇరువురి వాదనాలు విన్న న్యాయమూర్తి నిందితునికి జీవితఖైదు తో పాటు రూ.ఐదువెయ్యిల జరిమాన విధిస్తు జరిమాన కట్టని యెడల మరో ఆరునెలల జైలుశిక్ష విధించినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్ 22:(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని యోగేశ్వర్ కాలనీలో మంగళవారం ఉదయం తాళం వేసిన ఇంటిలో గుర్తు తెలియని వ్యక్తులు చోరికి పాల్పడ్డారని ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. ఇంటియాజమాని తొగటి భూమేశ్వర్ ఉదయం 9గంటలకు తన ఇంటికి తాళం వేసి మామిడిపల్లిలోని వృద్ధాశ్రమానికి వెళ్లగా అదును చూసిన దొంగలు ఇంటి తాళం పగులగొట్టి లోనికి ప్రవేశించి బిరువాలో దాచిఉంచిన ఐదుతులాల బంగారు ఆభరణాలు, ఎనిమిదివందల గ్రాముల వెండి ఆభరణాలు ఎత్తుకె ళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

ఒకరికి రెండు రోజుల జైలుశిక్ష

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్ 22:(ఆంధ్రజ్యోతి):ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ మదిన హోటల్‌ను అర్ధరాత్రి వరకు తెరిచి ఉంచిన షేక్‌మజిద్‌కు రెండు రోజుల శిక్షను విధిస్తు ఆర్మూర్ మార్నింగ్‌కోర్టు మేజిస్ట్రేట్ గట్టు గంగాధర్ మంగళవారం తీర్పునిచ్చినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు.

బాలుడిపై కుక్కల దాడి

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్ 22:(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని ఆలూర్ రోడ్ 11వ వార్డులో శ్రేయాన్స్ అనే బాలుడిపై మంగళవారం వీధి కుక్కలు దాడికి పాల్పడ్డాయి. ఇంట్లో స్నానం చేసి బయట నిలబడిన బాలుడిని వీధి కుక్కలు దాడి చేయగా స్థానికులు గమణించి కుక్కలను తరమివేయడంతో బాలుడికి ముఖంపై తీవ్రగాయాలయ్యాయి. ప్రభుత్వ ఆసుప త్రికి తీసుకువెళ్లగా ప్రథమ చికిత్స నిర్వహించి జిల్లా ఆసుపత్రికి మెరుగైన చికిత్స కోసం తరలించారు. అలాగే పట్టణంలో మరో ప్రాంతంలో ఒకవ్యక్తిపై కుక్కలు దాడిచేసి ఇదేవిదంగా గాయపర్చాయి.ఇప్పటికైనా కుక్కలను పట్టుకొని వాటిని తరలించాలన్నారు.

చెరువులో పడి ఒకరి మృతి

ఆర్మూర్‌టౌన్,ఏప్రిల్ 22:(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని గూండ్ల చెరువులో పడి ఇందల్వాయి మండలం గౌరారం గ్రామానికి చెందిన ముద్దంగుల రమేష్ అనే వ్యక్తి ప్రమాదవశాత్తు మృతిచెందినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా బతుకు తెరువుకోసం అంకాపూర్ గ్రామానికి వచ్చి పశువులను మేపుతున్న రమేష్ చెరువులో పడిన పశువును కాపాడే ప్రయత్నంలో చేపలవల తట్టుకొని ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు. సంఘటన స్థలాన్ని ఎఎస్సై చిన్నయ్య పోలీసులు సిబ్బందితో పరిశీలించి మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య అపర్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

టీడీపీ సభ్యత్వ నమోదుతో బీమా వర్తింపు

● జిల్లా పార్లమెంటరీ కన్వీనర్ దేగాం యాదాగౌడ్



నందిపేటలో టీడీపీ సభ్యత్వ బీమా కార్డులను పంపిణీ చేస్తున్న యాదాగౌడ్

నందిపేట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి):తెలుగు దేశం పార్టీ సభ్యత్వం తీసుకున్న క్రియాశీల కార్యకర్తలకు రెండేళ్ల పాటు రూ.5లక్షల బీమా సౌకర్యం వర్తిస్తుందని టీడీపీ జిల్లా పార్లమెంటరీ కన్వీనర్ దేగాం యాదాగౌడ్ తెలిపారు. మంగళవారం నందిపేట మండల కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 75వ పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ సభ్యత్వం తీసుకున్న కార్యకర్తలకు బీమా కార్డులు, ట్యాగ్‌లు, ఐడెంటీ కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా దేగాం యాదాగౌడ్ మాట్లాడుతూ బీమా కార్డులను జాగ్రత్తగా భద్రపర్చుకోవాలని సూచించారు. పేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు కట్టుకోవడానికి డబ్బులు, నిరుద్యోగులకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇచ్చిన ఘనత చంద్రబాబు నాయుడుదేనని జిల్లా పార్లమెంటరీ కన్వీనర్ దేగాం యాదాగౌడ్ చెప్పారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ అధ్యక్షుడు దంతాల ఆనంద్, హడక్ కమిటీ సభ్యులు జ్యోతి నారాయణ, గీతాకార్మిక కమిటీ అధ్యక్షుడు లక్ష్మి నారాయణ గౌడ్, పట్టణ అధ్యక్షులు వీరాజీ రాజశేఖర్, మాజీ సర్పంచ్ ఆమంద్ మల్లేష్, నాయకులు శ్రీనివాస్, సాయిబాబ, కార్తీక్ తదితరులు ఉన్నారు.

సన్నబియ్యం పంపిణీ చారిత్రాత్మక నిర్ణయం



కొత్తపల్లిలో సహపంక్తి భోజనం చేస్తున్న అన్వేష్‌రెడ్డి

ముప్కాల్, ఏప్రిల్22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పేదలకుసన్న బియ్యం పంపిణీ చేయడం ఒక చారిత్రాత్మక నిర్ణయమని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం ముప్కాల్ మండలంలోని కొత్తపల్లి గ్రామంలో కోటకాంతరావు ఇంట్లో వారి దంపతులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం పేద ప్రజల కడుపు నింపుతుందన్నారు.రాష్ట్రంలో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న నిరు పేదలందరికి పూర్తిస్థాయిలో ఆహార భద్రత కల్పించేందుకే సన్నబియ్యం కార్యక్రమం చేపటామన్నారు. ఈ పథకం పక్కగా అమలుపర్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రేషన్‌షాపుల ద్వారా లబ్ధిదారులకు లోటుపాట్లు ఉంటే సరిచేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డి, వేల్పూర్ మార్కెట్ కమిటి డైరెక్టర్ చందరవి, ముప్కాల్ మండల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మగ్గిడి ముత్యంరెడ్డి, కిసాన్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సాగర్‌రెడ్డి, చిన్నారెడ్డి, దనుష్, శ్రీకాంత్, కాంత రావు, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తగిలేపల్లిలో బోనాల ఉత్సవాలు



బోనాలను తీసుకువెళ్తున్న మహిళలు

వర్ని,ఏప్రిల్22(ఆంధ్రజ్యోతి): వర్ని మండలం తగిలేపల్లి గ్రామంలో మంగళవారం బోనాల పండుగ సంబరాలు ఘనంగా నిర్వహించారు. గజ్జెలమ్మ, ఊరడమ్మ తల్లి ఆలయాల ప్రథమ వార్షికోత్సవంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. బోనాల సమర్పణలో భాగంగా అన్ని కులాల వారు ఆలయాల వద్ద మేకలను బలి ఇచ్చారు. బోనాలతో తీసుకొచ్చిన జలాలను అమ్మవార్లకు జలాభిషేకం చేశారు. వందల సంఖ్యలో మహిళ భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పండాలని, ఆయురారోగ్యాలతో ఉండేలా దీవించాలని అమ్మవార్లకు వేడుకున్నారు.

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక

ఏర్గట్ల,ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రానికి చెందిన పలువురు మంగళవారం కాంగ్రెస్ పార్టీ బాల్కొండ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా సునీల్ కుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్, బద్దం లింగారెడ్డి, పన్నాల నర్సారెడ్డి, ముస్కు మోహన్, కొలిప్యాక రవి, ఎలేటి మోహన్, బద్దం ముత్యం కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి ఐదు రోజుల జైలు

ఎడపల్లి, ఏప్రిల్22(ఆంధ్రజ్యోతి):మద్యం తాగివాహనం నడిపిన వ్యక్తికి బోధన్ కోర్టు ఐదు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎడపల్లి ఎస్సై వంశీ కృష్ణారెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 20వ తేదీన చేపట్టిన డ్రంకెన్ డ్రైవ్ టెస్టులో భాగంగా అంబం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పరిమితికి మించి మద్యం తాగి వాహనం నడపడంతో అతనిని మంగళవారం బోధన్ కోర్టులో హాజరు పరుచగా న్యాయాధికారి శేషతల్ప సాయి ఐదు రోజుల జైలు శిక్ష విధించినట్లు తెలిపారు. మద్యం తాగి ఎవరు వాహనం నడుపొద్దని తాగి వాహనం నడిపితే చర్యలు తప్పవని ఎస్సై తెలిపారు.

కోనాసముందర్‌లో పోలీసు కళాజాత

● సైబర్ నేరాలపై పోలీసుల అవగాహన

కమ్మర్‌పల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనాసముందర్‌లో కమ్మర్‌పల్లి ఎస్సై అనిల్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ కళాజాత కార్యక్రమాన్ని నిర్వహించి సైబర్ నేరాలు, మాదకద్రవ్యాలు, రోడ్డు భద్రత, హెల్మెట్,ఆవశ్యకత మహిళ రక్షణ, సీటీంల పనితీరు తదితర అంశాలపై కళాకారులు పాటల రూపంలో అవగాహన కల్పించగా చట్టాలు, 100 డైల్, అందవిశ్వాసాలపై అవగాహన గ్రామాల భద్రత అన్ లైన్ మోసాలు, విదేశీ ఉద్యోగాలపేర జరుగుతున్న మోసాలు, మాదక ద్రవ్యాల వినియోగంపై చట్టపర శిక్షలు తదిత అంశాలపై ఎస్సై అనిల్ రెడ్డి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాబృందం సభ్యులతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

చౌట్‌పల్లి పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే

కమ్మర్‌పల్లి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌట్‌పల్లి బాలికల ప్రాథమిక పాఠశాలలో మంగళవారం గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల వార్షిక పరీక్షల ఫలితాలను మండల విద్యాధికారి ఎన్ ఆంధ్రయ్య విడుదల చేశారు. ఫలితాలలో ప్రథమ, ద్వితీయ తృయ స్థానాలు సిద్ధించుకున్న విద్యార్థినులకు గోల్డ్ మెడల్స్, సిల్వర్ మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నేల్ల శ్రీనివాస్, అమ్మఆదర్శ పాఠశాల చైర్మన్ పెంట రమ, బాబయ్య, ఉపాధ్యాయులు మారుతి,అశోక్, గంగాకిషన్, తల్లిదండ్రులు విద్యార్థినులు పాల్గొన్నారు.

ప్రతీ ఉద్యోగికి పదవీ విరమణ సహజం

డొంకేశ్వర్,ఏప్రిల్22(ఆంధ్రజ్యోతి):పదవీ విరమణ ప్రతీ ఉద్యోగికి సహజమని డొంకేశ్వర్ ఎంఈవో రామకృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో పదవి విరమణ పొందిన ఉపాధ్యా యు డు సదానందం దంపతులను ఆయన సన్మానించారు. ఈ కార్యక్రమంలో నందిపేట మాజీ ఎంపీపీ వాకిడి సంతోష్‌రెడ్డి, కుదావన్‌పూర్ సొసైటీ చైర్మన్ కార్తీక్ రెడ్డి, కృష్ణారెడ్డి, గంగారెడ్డి, వెంకట్‌రెడ్డి, డాక్టర్ విజయ్, చిన్నారెడ్డి, వినోద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వీసీ యాదగిరి రావు

తెలంగాణ యూనివర్సిటీలో అంబరాన్నంటిన సంబరాలు

● ఘనంగా టీయూ కళాశాల వార్షికోత్సవ వేడుకలు

డిచ్‌పల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ యూనివర్సిటీ సంస్కృతిక క్రీడా దినోత్సవం సందర్భంగా మంగళవారంరాత్రి ఏర్పాటు చేసిన వేడుకలు అంబరాన్నంటాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న కబడ్డీ భారత టీం ప్రధాన కోచ్ డా.శ్రీనివాస్‌రెడ్డి హాజరై మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అత్యధిక బడ్జెట్ కేటాయించడంతో పాటు క్రీడా వర్సిటీలను ఏర్పాటుచేయడం స్వాగతించాలని పేర్కొన్నారు. క్రీడల్లో విద్యార్థులు రాణించి మానసిక ఉల్లాసం పొందలన్నారు. వీసీ యాదగిరి రావు మాట్లాడుతూ... విద్యాతో పాటు క్రీడా సంస్కృతిక కార్యక్రమాలకు సమ ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. రిజిస్ట్రార్ యాదగిరి మాట్లాడుతూ గ్రామీణ వర్సిటీలలో అత్యంత ప్రతిభ గల విద్యార్థులు ఉన్నారని పేర్కొన్నారు. ఇక్కడి వనరులను ఉపయోగించుకొని అభివృద్ధి చెంది వర్సిటీకి గుర్తింపు తీసుకురావలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మామిడాల ప్రవీణ్, ప్రొ.లావణ్య, స్పోర్ట్స్ డైరెక్టర్ బాలకిషన్, ఆడిట్‌సెల్ డైరెక్టర్ చంద్రశేఖర్, కంట్రోలర్ సంపత్, ఎన్‌ఎస్‌ఎస్ డైరెక్టర్ రవీందర్, ప్రొ.కనకయ్య, ప్రొ.ఆరతి, వాసంచంద్రశేఖర్, లక్ష్మణ చక్రవర్తి, ప్రసన్నశీల, సమత, విద్యావర్ధిని, పున్నయ్య, అంజనేయులు, నాగరాజు, ఏఈ వినోద్, సాయాగౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.



నడిపల్లి పంచాయతీలో పన్నుల వివరాలు తెలుసుకుంటున్న డీఎల్పీవో

నిజామాబాద్ డివిజన్‌లో 99 శాతం పన్నుల వసూళ్లు : డీఎల్పీవో

డిచ్‌పల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ డివిజన్‌లో పనిచేస్తున్న కార్యదర్శులు పంచాయతీ సిబ్బంది ఇంటిపన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టడంతో 99శాతం పన్నులు వసూలయ్యాయని డీఎల్పీవో శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలంలోని నడిపల్లి పంచాయతీలో గ్రామ కార్యదర్శి రాధికను పన్నుల వసూళ్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. డివిజన్‌లో కార్యదర్శులు అంకిత భావంతో పని చేసి పన్నుల వసూళ్లపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారని, ఎక్కడ కూడా తాగునీటి ఎద్దడి ప్రస్తుత పరిస్థితుల్లో రాకుండా అందుకు అనుగుణంగా చర్యలు తీసుకున్నామని అన్నారు. వ్యవసాయ పంట పొలాలు కోతలు పూర్తి దశ కు చేరడంతో నీటి ఎద్దడి నివారణకు వ్యవసాయ బోర్లను సైతం గ్రామాల అవసరాలకు ఉపయోగించుకునేల సిబ్బందికి ఆదేశాలు జారీ చేసినట్లు డీఎల్పీవో తెలిపారు. ఇటీవల నడిపల్లి తైబజార్ వేలం పాటను దక్కించుకున్న వ్యక్తి పంచాయతీకి డిపాజిట్ డబ్బులు చెల్లించాలని ఆయన సూచించారు. ఆయన వెంట కార్యదర్శి రాధిక, జూనియర్ అసిస్టెంట్ రజత్ కుమార్, బిల్ కలెక్టర్‌లు రాము, సంతోశ్ ఉన్నారు.

ఆంధ్రజ్యోతి పరిశీలన



సిద్దాపూర్ ఎత్తిపోతల పథకం



మంథని ఎత్తిపోతల పథకం

రైతుల సాగు నీటి కష్టాలను తీరుస్తున్న ఎత్తిపోతలు

● ఎత్తిపోతలతో పంటలకు పుష్కలంగా నీరు ● అన్నదాతలను ఆదుకుంటున్న లిఫ్ట్ ఇరిగేషన్లు ● నందిపేటలో 12 ఎత్తిపోతల పథకాలు

ఆర్మూర్ రూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): సాగు నీటి కోసం నానా అవస్థలు రైతులను ఎత్తిపోతల పథకాలు ఆదుకుంటున్నాయి. పంటలు వేసి అరకొర నీరందించే బోర్లపై ఆశలు పెట్టుకుని.. వర్షాల కోసం ఆకాశం వైపు చూసే ఆ నాటి పరిస్థితులు మారాయి. అప్పటి నాయకులు దూరదృష్టితో గోదావరి బ్యాక్ వాటర్ నుంచి ఎత్తిపోతల నిర్మాణాలు చేపట్టడంతో రైతుల సాగు నీటి కష్టాలు తీరాయి. అప్పటి బాల్కొండ నియోజకవర్గంలోని నందిపేట మండలంలో ఎత్తిపోతల పథకాల పరిధిలో వ్యవసాయ రంగానికి సాగునీరు పుష్కలంగా అందుతోంది. ఎత్తిపోతల పథకాలతో పాటు మేజర్ ప్రాజెక్టైన గుత్ప ఎత్తిపోతల పథకం ద్వారా సుమారు 40వేల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నారు.

నందిపేట్‌లో 12 ఎత్తిపోతల పథకాలు

ఉమ్మడి నందిపేట మండలంలో గోదావరి జలాలపై 12 ఎత్తిపోతల పథకాలు ఏర్పాటు చేశారు. వన్నెల్ (కే), తల్వేద, సీహెచ్ కొండూర్, బాద్గుణ, సిద్దాపూర్, నికాల్‌పూర్, డొంకేశ్వర్, మారంపల్లి, దత్తాపూర్, గాదెపల్లి గ్రామాల పరిధిలో లిఫ్టలను ఏర్పాటు చేసి పైప్‌లైన్‌ల ద్వారా రైతులకు వ్యవసాయక్షేత్రాలకు సాగునీరు అందిస్తున్నారు. అదేవిధంగా ఆర్మూర్ మండలం మంథని శివారులో మరో ఎత్తిపోతల పథకాన్ని నిర్మించి మంథని, పిప్రి గ్రామాలకు సుమారు 3వేల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నారు. ఇదే ప్రాంతంలో దేగాం శివారులో సిద్దాపూర్ ఎత్తిపోతల పథకం ద్వారా దేగాం, ఆలూర్ గ్రామాలలోని సుమారు 2వేల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నారు. ఎత్తిపోతల పథకాల నిర్మాణంకు రైతులు సాగు నీటి కోసం ఇబ్బందులు పడే అవస్థలు తప్పాయి. అప్పటి శాసన సభ్యుడు స్పీకర్ సురేష్‌రెడ్డి 12 ఎత్తిపోతల పథకాలకు నిధులు మంజూరు చేయించారు. ఒకే మండలంలో 12 ఎత్తిపోతల పథకాలు నిర్మించడం రికార్డుగా చెప్పొచ్చు.



దేగాంలో లిఫ్ట్‌నీటిని పంట పొలాలకు తరలించేందుకు ఏర్పాటు చేసిన డిస్టిబ్యూటర్

గుత్ప ఎత్తిపోతలతో ద్వారా 40వేల ఎకరాలకు నీరు

నందిపేట మండలం ఉమ్మెడ శివారులో నిర్మించిన గుత్ప ఎత్తిపోతల పథకం ద్వారా ఆర్మూర్, మాక్లూర్, వేల్పూర్, జక్రాన్‌పల్లి, బాల్కొండ మండలాలకు సాగునీరు సరఫరా చేస్తున్నారు. గోదావరి తీరంనుంచి నీటిని లిఫ్ట్ చేసి గుత్ప చెరువులో వదులుతున్నారు. అక్కడి నుంచి ప్రధాన నిజాంసాగర్ కాలువల ద్వారా, పిల్లకాలువల ద్వారా వివిధ మండలాలలోని చెరువులు నింపి పంటలకు సాగునీరు అందిస్తున్నారు. గుత్ప ఎత్తిపోతల పథకం ఏర్పాటుకు ఆద్యుడు అంక్సాపూర్ అశోక్‌రెడ్డిగా చెప్పుకోవచ్చు. నాడు 1990 దశకంలో ఎత్తిపోతల పథకం కొరకు ఆయన ఎనలేని కృషిచేసి అప్పటి ప్రభుత్వానికి, అధికారులకు నివేదికలు అందజేశారు. ఎట్టకేలకు గుత్ప ఎత్తిపోతల పథకం మంజూరై రైతులకు సాగునీరు అందిస్తుంది.

కొత్తగా మరో మూడు ఎత్తిపోతల పథకాలు

గత సంవత్సరం ప్రభుత్వం కొత్తగా మరోమూడు ఎత్తిపోతల పథకాలను మంజూరు చేసింది. సుర్బిర్యాల్, చిట్టాపూర్ ఎత్తిపోతల పథకానికి రూ.150 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ లిఫ్ట్ ద్వారా 9వేల 200 ఎకరాలకు సాగునీరు అందించాలని ప్రణాళికలు రూపొందించారు. ఆదేవిధంగా మచ్చర్ల ఎత్తిపోతల పథకం మాక్లూర్ మండలంలోని గుంజిలి, చిక్లి ఎత్తిపోతల పథకాలు నిర్మాణంలో ఉన్నాయి. వీటి పనులు పూర్తయితే వందల ఎకరాలకు సాగునీరు అందుతుంది.



టీయూ సౌత్‌క్యాంపస్‌లో సమ్మె చేస్తున్న దృశ్యం

మొక్కలు నాటి కాంట్రాక్టు అధ్యాపకుల నిరసన

● కొనసాగుతున్న కాంట్రాక్ట్ అధ్యాపకుల సమ్మె

భిక్కనూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని భిక్కనూరు మండలంలోని బీటీఎస్ చౌరస్తాలో గల తెలంగాణ యూనివర్సిటీ సౌత్‌క్యాంపస్ కాంట్రాక్ట్ అధ్యాపకులు డిమాండ్ చేశారు. మంగళవారం కాంట్రాక్ట్ అధ్యాపకులు నిరవధిక సమ్మెలో బాగంగా ధరిత్రి దినోత్సవాన్ని నిర్వహించి క్యాంపస్ ఆవరణలో మొక్కలు నాటి వినూత్నంగా నిరసన తెలిపారు. ఈమేరకు వారు మాట్లాడుతూ ప్రభుత్వం తమ సేవలను గుర్తించి తమకు ఉద్యోగ భద్రత కల్పించి తమ న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కోఆర్డినేషన్ కమిటీ సభ్యుడు నారాయణ, కాంట్రాక్ట్ అధ్యాపకులు యాలాద్రి, సునీత, నర్సయ్యరమాదేవి, నిరంజన్, వైశాలి, సరిత, శ్రీకాంత్, దిలీప్ పాల్గొన్నారు.

● కొనసాగుతున్న పార్ట్‌టైం అధ్యాపకుల సమ్మె

భిక్కనూరు మండలంలోని బీటీఎస్ చౌరస్తాలో గల తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌లో పార్ట్ టైం అధ్యాపకుల సమ్మె కొనసాగుతోంది. సమ్మెలో బాగంగా మంగళవారం క్యాంపస్ ఆవరణలో బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే జీవో నెం.21ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్ట్ టైం అధ్యాపకులు పాల్గొన్నారు.

కనుమరుగవుతున్న జోడెడ్ల బండ్లు!

● ఎడ్ల బండ్లపై యాంత్రీకరణ ప్రభావం ● రోజురోజుకూ తగ్గుతున్న పశువుల సంఖ్య ● ట్రాక్టర్ల రాకతో వడ్రంగి పరికరాలను మూలన పడేసిన రైతులు

మెండోర, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): బండెనక బండికట్టి.. పదహారు బండ్లు కట్టి ఏ బండ్ల పోతవ్ కొడుకో.. అనే పాట పాడుకుంటూ రైతన్న కాండికి కనెలు దొత్తెలు ఏడ్లకు కట్టి పోటికెలో గొర్రు, నాగలి అందులో పెట్టి ఎడ్లబండిని అందులో పెట్టి నడుపుతుంటే రైతు హుశారే వేరు. తొలకరి కురిసి పంట భూములు పచ్చ చిగురు అలకరించుకునే నుంచి వేసవి కాలంలో పశువుల పెండ తోలే వరకు ఎడ్ల బండ్లే ఆధారం. కానీ నేడు ఆ రైతు రథం కనుమరుగై పోయింది.



జోడెడ్ల బండిపై రైతు

ఇంటి ముందు కానరాని జోడెడ్లు

ఇంటిముందు కడెద్దులు ఎడ్ల బండి ఉంటే వాటిని ఆభరణాలుగా రైతులు భావించేవారు. తొలకరి జల్లులు పడగానే రైతన్నలు వ్యవసాయ పనులకు పండించిన పంటను వేసవిలో ఎరువులను తరలించేందుకు జోడెడ్లబండ్లను ఉపయోగించేవారు. కానీ రానురాను వాటి వినియోగం తగ్గిపోయింది. రైతన్న ఇంటిముందు రాజహంసల ఉండే జోడెడ్ల బండ్లు కనుమరుగయ్యాయి. నేడు పల్లెల్లో ఎక్కడ వెతికినా ఇవి కనిపంచడం లేదు. రైతుల జీవితంలో మమేకమై వారికి చైతన్య రథంలా సేవలందించిన ఎడ్లబండ్లు కనిపించకుండా పోయాయి.

నారు రాజహంసలా ఉండే ఎడ్ల బండ్లు

కట్టె చెక్క ఇనుముతో రెండు చక్రాలు తయారు చేసి మాడిగేము తొట్లే బదులు రెండు పేరెడు బద్దలు తొట్లె బదులకు ఎనిమిది గడుగలు, కంటికి అటు ఇటు నాలుగు కనెలు రెండు దొత్తెలు కట్టి వారి ఎడ్లను కట్టుకుని పోతుంటే ఆ మజానే వేరు. అప్పట్లో ప్రతీ రైతు ఇంటిముందు కూర్చొని ఆ బండిని, ఆ ఎడ్లను రైతులు చూస్తూ మురిసేవారు. నాడు నలుగురు, ఐదుగురు రైతులు కలిస్తే ఎడ్ల గురించే చర్చించుకునేవారు. ఎడ్లబండి గంటల సవ్వడి వింటే చాలు రోడ్డు వెంట వెళ్లే ఆ ఎడ్లను చూసి మురిసిపోయే రోజులు నాడు ఉండేవి. కానీ నేడు ఆ సవ్వడులు లేకుండా పోయాయి.

కనిపించని ఆ నాటి వైభవం

రానురాను వ్యవసాయ పనుల్లో మార్పులు వచ్చాయి. యాంత్రీకరణ రంగప్రవేశం వచ్చింది. ఎడ్ల పోషణ రైతులు కష్టంగా మారింది. వాటిని పెంచ లేక రైతుకష్టాల్లో కూరుకుపోయాడు. దీంతో జోడెడ్ల బండ్లు మూలానపడ్డాయి. రానురాను చక్రాలు విరిగిపోయాయి. ఇనుము పుచ్చిపోయింది. గతంలో ప్రతీ గ్రామంలో పదుల సంఖ్యలో ఉన్న బండ్లు నేడు ఒకటి రెండు కనిపిస్తున్నాయి. అవి కూడా మూలాన పడే అ వకాశం ఉన్నాయి. అప్పట్లో ప్రతీ రైతు ఇంట్లో ఉండే ఎడ్లబండ్లు వ్యవసాయ పనుల్లో రైతులకు ఎంతో సేవలించేవి. తొలకరి జల్లులు పడ్డనుంచి ధాన్యాలు తరలించే వరకు ఎంతో ఉపయోగపడేవి. ఎడ్లబండ్లు లేనివారు ఇతర రైతుల వద్ద ఉన్నవాటిని కిరాయి మాట్లాడుకొని వ్యవసాయ సామగ్రిని తరలించుకునేవారు .

జోడెడ్లు బండ్లుపోయే.. ట్రాక్టర్లు వచ్చే

ఎడ్లబండ్లు కనుమరుగవ్వడానికి ప్రధాన కారణం. యాత్రీకరణ ప్రతీ గ్రామంలో ట్రాక్టర్లు వచ్చేశాయి. వ్యవసాయ పనులకు ఉపయోగప డుతున్నాయి. చాలా సమయం ఆదా అవుతుంది. దీంతో రైతులు ఎడ్లబండ్లను పక్కకు పెట్టి ట్రాక్టర్లను వినియోగిస్తున్నారు. దీంతో ఎంతో చరిత్ర ఉన్న ఎడ్ల బండ్లు కనిపించకుండా పోయాయి. నాడు రైతులు వడ్రంగి వద్దకు టేకు కలప తీసుకచ్చి ఎడ్లబండ్లను వడ్రంగులతో తమకు నచ్చిన విధానాలతో తయారు చేయించుకునేవాళ్లు కాలక్రమేణా యాంత్రీకరణ ప్రభావంతో ట్రాక్టర్లు పెరగడంతో వ్యవసాయ పనుల్లో ట్రాక్టర్ల వల్ల పెట్టుబడులు ఎక్కువగా అవుతుండటంతో రైతన్నలకు ఒక్కప్పటి ఎడ్ల బండ్ల జ్ఞపకాలు గుర్తుకు వస్తున్నాయి.

ఇప్పుడన్నీ యంత్రాలతోనే పనులు

● మిట్టపల్లి వెంకట్‌రెడ్డి, మెండోర



నాడు జోడెడ్లతో వ్యవసాయ పనులు చేసేవాళ్లం. వ్యవసాయం చేస్తే ఖర్చు తక్కువ అయ్యేది. నేడు అటువంటి జోడెడ్లు కనుమరుగవడంతో ప్రతీ పని యంత్రాలతో వ్యవసాయ పనులుచేస్తున్నాం. దీంతో వ్యవసాయానికి పెట్టిన పెట్టుబడి కూడా రావడం లేదు. నేటి కంటే నాటి వ్యవసాయమే బాగుండేది. ప్రభుత్వం స్పందించి రైతులకు మేలుపడే యంత్రాలు సబ్సిడీలు అందించాలి.

రైతులకు అవసరమైన యంత్రాలు ఇవ్వాలి

● చిట్యాల వెంకట్‌రెడ్డి, మెండోర



నాడు జోడెడ్లు, వడ్రంగి, కుమ్మరి వాళ్లు చేసే యంత్రాలతో వ్యవసాయం చేసేవాళ్లం. అటువంటిది నేడు కనుమరుగు అవడంతో యంత్రాలతో చేస్తున్నాం. ప్రస్తుతం వ్యవసాయం చేయాలంటే రైతుకు భారంగా మారింది. పెట్టుబడి కూడా రావడం లేదు. ఎందుకంటే ఏ పని చేయాలన్నా యంత్రాలతో చేయాల్సి వస్తోంది. పంట విక్రయించడానికి వెళితే గిట్టుబాటు ధర రావడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించి రైతులకు ఉపయోగపడే యంత్రాలు అందుబాటులోకి తీసుకురావాలి.



నాడు ఎడ్లను అరక కట్టి దున్నుతున్న రైతు



వ్యవసాయ పనుల కోసం భూమి దున్నే యంత్రాన్ని సిద్ధం చేస్తున్న రైతులు



నేడు ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న రైతు



సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

రేణుకా ఎల్లమ్మ ఆలయంలో సామూహిక కుంకుమార్చన

ఎడపల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం సామూహిక లలితా సహస్రనామ కుంకుమార్చన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని లలితా సహస్రనామ కుంకుమార్చన చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నటరాజ్ గౌడ్, మల్లాగౌడ్, ఎల్లాగౌడ్, రమణా గౌడ్ తదితరులు ఉన్నారు.


మొక్కలు నాటుతున్న ఫారెస్టు చీఫ్ కన్జర్వేటర్ చంద్రశేఖర్‌రెడ్డి

ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ప్రాంతంలో ఎకోటూరిజం

● ఫారెస్ట్ చీఫ్ కన్జర్వేటర్ చంద్రశేఖర్‌రెడ్డి

సుభాష్‌నగర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు బ్యాక్ వాటర్ నిలిచే ప్రాంతాలను ఎకోటూరిజం ప్రదేశాలుగా తీర్చిదిద్దుతామని ఫారెస్టు చీఫ్ కన్జర్వేటర్ చంద్రశేఖర్‌రెడ్డి వెల్లడించారు. జిల్లా కేంద్రంలోని ఫారెస్టు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుతో కలిసి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ఏరియాలో ఎకోటూరిజం అభివృద్ధి కోసం అనువైన పరిస్థితుల గురించి కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ సమగ్ర వివరాలతో నివేదికలు సమర్పిస్తే తక్షణమే మంజూరు చేస్తామని నిధులు సైతం కేటాయిస్తామని తెలిపారు. రాష్ట్రంలో అనువైన ప్రాంతాలను పర్యావరణ హితంతో కూడిన పర్యాటక ప్రదేశాలుగా అభివృద్ధి చేసి ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం కల్పించడమే లక్ష్యంగా పనిచేయాలని అధికారులకు సూచించారు. ఎకోటూరిజం అభివృద్ధి చర్యల్లో భాగంగా 25 సఫారి వాహనాలను కొనుగోలు చేశామన్నారు. నందిపేట్ మండలంలో ఎకోటూరిజం అభివృద్ధి పనుల్లో భాగంగా సఫారి వాహనాల కొనుగోలు, వాచ్ టవర్, పార్కింగ్ ప్రదేశం, రెస్టారెంట్లను మొదటగా అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఎస్సారెస్పీ బ్యాక్‌వాటర్ ఏరియా అయిన ఉమ్మెడలో 1 ఎకరం 20 గుంటలు, జలాల్‌పూర్‌లో 3 ఎకరాలు ఎకోటూరిజం అభివృద్ధి చేస్తామన్నారు. ఉమ్మెడ నుంచి బాసర వరకు బోటింగ్ ప్రణాళికను సిద్ధం చేశామన్నారు. ఉమ్మెడ నుంచి గాదెపల్లి వరకు 20 కిలోమీటర్లు, గాదెపల్లి నుంచి జలాల్‌పూర్ వరకు 16 కిలోమీటర్ల సఫారి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. మూడు రోజుల్లో సమగ్ర ప్రణాళికలు, కావాల్సిన నిధుల వివరాలతో నివేదిక సమర్పిస్తే వెంటనే నిధులు విడుదల చేస్తామన్నారు. అంతకుముందు జిల్లా అటవీ శాఖ కార్యాలయ ఆవరణలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో ఎకోటూరిజం డైరెక్టర్ రంజిత్ నాయక్, జిల్లా అటవీ శాఖ అధికారి వికాస్ మీనా, ఆర్డీవో రాజాగౌడ్, ఎఫ్‌ఆర్‌వోలు జిల్లా ఫారెస్టు అధికారుల సంఘం అధ్యక్షుడు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

భూ భారతిపై అవగాహన అవసరం

● కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

ముప్కాల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): భూసమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూభారతి చట్టంపై రైతులు సంపూర్ణ అవగాహన ఏర్పర్చుకోవాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని మనికంఠ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన భూభారతి చట్టంపై అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ భూసమస్యలు ఉన్న రైతులు భూభారతి పోర్టల్ లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. మే మొదటి వారంలో అధికారులు గ్రామాల వారిగా సదస్సులను ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. భూభారతి చట్టం ప్రకారం భూసంబందిత సమస్యలను నిర్థిష్ట గడువులోపల పరిష్కరిస్తామని పేర్కొన్నారు. భూ సమస్యలను స్థానికంగానే పరిష్కరించేందుకు రెవెన్యూ డివిజన్ అధికారి, కలెక్టర్లకు అధికారాలను కల్పించారని వివరించారు. పేద రైతులకు ఉచిత న్యాయసహాయం అందిస్తామన్నారు. పెండింగ్‌లో ఉన్న సాదాబైనామ పరిష్కారం కోసం త్వర లోనే మార్గదర్శకాలు వెలువడనున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి, వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డి, వేల్పూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ జైడి చందరవి, ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్, తహసీల్దార్ గజానంద్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్, రైతులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో బాలికలదే హవా

(ఐదో పేజీ తరువాయి)

గత యేడాది ఇంటర్ ప్రథమ సంవత్సరం ఫలితాలలో 49.95 శాతం ఉత్తీర్ణత సాదించగా ఈ సంవత్సరం 53.37 శాతం ఉత్తీర్ణత సాదించింది. సెకండ్ ఇయర్ ఫలితాలలో గత విద్యాసంవత్సరం 59.59 శాతం ఉత్తీర్ణత సాదించగా ఈ సంవత్సరం 58.21 శాతంకు పడిపోయింది. ఈ విద్యాసంవత్సరం మాత్రం జిల్లా ఉత్తీర్ణత శాతంలో ఇతర జిల్లాలతో పోలిస్తే వెనకబడింది.

మే 22 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు..

మే 22 నుంచి ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్షల్లో మార్కులు తక్కువగా వచ్చినవారు రీకౌంటింగ్ మరియు రీవెరిఫికేషన్ కోసం వారంలోగా దరఖాస్తులు చేసుకోవచ్చని ఇంటర్మీడియెట్ విద్యాశాఖ అధికారులు తెలిపారు. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించి పరీక్ష ఫీజు తేదీలను త్వరలో వెల్లడించనున్నారు.

రైతులకు ఆధునిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించేందుకే రైతు మహోత్సవం

(ఐదో పేజీ తరువాయి)

పెంచుకుంటే వారికి ఎంతోమేలు జరుగుతుందన్నారు. రైతు మహోత్సవ కార్యక్రమం రైతులకు ఎంతోమేలు జరుగుతుందని వ్యవసాయ రైతు కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్ అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ రంగాల్లో అనుభవం ఉన్న శాస్త్రవేత్తలతో పాటు ఆదర్శ రైతులు, వ్యవసాయ అధికారులు రైతులకు ఉపయోగపడే ఎన్నో విషయాలను వివరిస్తున్నారన్నారు.ఈ సమావేశంలో కార్పొరేషన్ చైర్మన్లు తాహెర్‌బిన్ హుందాన్, మానాల మోహన్ రెడ్డి, ఆర్మూర్ నియోజకవర్గ ఇంచార్జి వినయ్‌రెడ్డితోపాటు పలువురు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న కార్యక్రమం

గిరిరాజ్ కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్న రైతు మహోత్సవ కార్యక్రమం ఆకట్టుకుంటుంది. ఉమ్మడి జిల్లా నుంచే కాకుండ, సిరిసిల్లా, జగిత్యాల, సిద్దిపేట్‌నుంచి కూడా పలువురు రైతులు వచ్చిఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. ఆయా పరికరాలు ఎట్లా ఉపయో గించవచ్చో అధికారులను అడిగి తెలుసుకుంటున్నారు. వ్యవసాయ దారులకు స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలను ఏ విధంగా ఇస్తున్నారో, ఏ పంటలకు, ఏ యంత్రాలకు ఎంతెంత రుణాలను అందిస్తున్నారో స్టాల్స్‌లో ఉన్న బ్యాంక్ అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

రేపటి నుంచి 26 వరకు రాజీవ్ యువ వికాస్ దరఖాస్తుల పరిశీలన

సుభాష్‌నగర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ పరిధిలోని రాజీవ్ యువ వికాస్ పథకం దరఖాస్తుల పరిశీలనకు దరఖాస్తుదారులు ఈనెల 24 నుంచి 26 వరకు హాజరుకావాలని నగర పాలక సంస్థ కమీషనర్ దిలీప్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, క్రిస్టియన్ మైనార్టీ, దివ్యాంగుల కార్పొరేషన్‌లకు సంబంధించి ఆన్‌లైన్ దరఖాస్తు కాపీతో పాటు ఒరిజినల్, జిరాక్స్ సర్టిఫికెట్లను తీసుకురావాలన్నారు. నగరంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో దరఖాస్తుల పరిశీలన ఉంటుందని తెలిపారు. ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, ఆదాయ ధ్రువపత్రం, కులధ్రువీకరణ పత్రం, విద్యార్హత సర్టిఫికెట్లు, శిక్షణ సర్టిఫికెట్లు, అనుభవం సర్టిఫికెట్లు, సదరం సర్టిఫికెట్లు వెంట తెచ్చుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీలు, దివ్యాంగులకు 24వ తేదీన, బీసీ, ఎంబీసీ, ఈబీసీ, బీసీ అభ్యర్థులు 25వ తేదీన, మైనార్టీ కార్పొరేషన్, క్రిస్టియన్ మైనార్టీ అభ్యర్థులు 26వ తేదీన హాజరుకావాలని తెలిపారు. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు దరఖాస్తు పరిశీలన ఉంటుందని సకాలంలో హాజరుకావాలని కోరారు.

ఇంటర్ ఫలితాలలో కాకతీయ విద్యార్థులకు రాష్ట్ర స్థాయి ర్యాంకులు

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ఫలితాలలో ఎప్పటిలాగే నగరానికి చెందిన కాకతీయ విద్యార్థులు రాష్ట్ర స్థాయి మార్కులతో సత్తాచాటారు. ఇంటర్ సెకండర్ ఇయర్ ఎంపీసీ, బైపీసీ, ఇంటర్ ఫస్టియర్ ఎంపీసీ, బైపీసీలలో కాకతీయ విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారు. మంగళవారం విడుదలైన ఫలితాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు సాఫా అకీల్ 992/1000, త్రిష చౌదరి 991/1000, అయేషా ఫాతిమా 988/1000, జి.శ్రీలేఖ 987/1000, ఎం.లోకేష్ 987/1000, బైపీసీలో అమ్తుల్ హదీ మహినా 992/1000, జునైరా అంబర్ 992/1000, సహా సనీలా 988/1000 మార్కులు సాధించారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీలో బి.కావ్యశ్రీ 467/470, ఎం.హర్షిత 466/470, నిత్యశ్రీ 466/470, ఎం.మృదుల 466/470, బి.లాస్యశ్రీ 466/470, బైపీసీలో హనియా ఉమీమా 435/440, వి.ఇందు 435/440, తుబా ఫాతిమా 434/440 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా కళాశాలలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఐఐటి/నీట్ అకాడమి డైరెక్టర్ సీహెచ్ రామోజీరావు, విద్యాసంస్థల డైరెక్టర్ తేజస్వినిలు అభినందించారు. ఇటీవల విడుదలైన జేఈఈ మెయిన్స్ ఫలితాలలోనూ కాకతీయ విద్యార్థులు జాతీయ స్థాయిలో వివిధ కేటగిరిలలో ర్యాంకులు సాధించి జిల్లా సత్తా చాటారని అన్నారు. ఇంటర్‌తో పాటు తొలిప్రయత్నంలోనే జేఈఈ మెయిన్స్ ర్యాంకులతో పాటు ఇంటర్ ఫలితాలలోనూ కాకతీయ విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించడం జిల్లాకు గర్వకారణం అన్నారు. విద్యాసంస్థల చైర్పర్సన్ విజయలక్ష్మి మాట్లాడుతూ నిరంతర పర్యవేక్షణ, విద్యార్థుల శ్రమ, తల్లిదండ్రుల ప్రొత్సాహంతో ఈ ఫలితాలు సాధించామన్నారు. విద్యార్థులకు, తల్లిదండ్రులకు, రాష్ట్రస్థాయి ఫలితాలు వచ్చేందుకు సహకరించిన అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సందిప్‌కులకర్ణి, రణదీష్, వైస్ ప్రిన్సిపల్ శ్యామ్‌పాల్గొన్నారు.


జునేరా అంబర్ (992/ 1000 బైపీసీ)


కావ్యశ్రీ (467/470)


ఎం.హర్షిత (466/470)

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అవుతా...

: సోఫా అకీల్ (ఎంపీసీ, 992/ 1000)

కాకతీయ కళాశాలలో చక్కటి ప్రణాళిక, వ్యక్తిగత శ్రద్ధతో ఈ మార్కులు సాధించగలిగాను. రాష్ట్రస్థాయిలో మూడవ ర్యాంకు సాధించడం ఆనందంగా ఉంది. భవిష్యత్తులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కావాలనేది నా కోరిక. విద్యాసంస్థల యాజమాన్యం నిరంతర పర్యవేక్షణ, ప్రోత్సాహం వల్లే నాకు రాష్ట్ర స్థాయిలో ఈ ర్యాంకు వచ్చింది.

12గంటలు కష్టపడ్డా..: అమ్తుల్ హదీ మెహెరినా (992/1000 బైపీసీ)

ప్రతీరోజు 12 గంటల పాటు కష్టపడి చదవడం వల్లే బైపీసీలో రాష్ట్రస్థాయిలో మూడవ ర్యాంకు సాధించగలిగాను. నిరంతరం పర్యవేక్షణతో పాటు వ్యక్తిగత శ్రద్ధతో అధ్యాపకులు, యాజమాన్యం అందుబాటులో ఉండి సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేసేవారు. పర్ఫెక్ట్ ప్లానింగ్, షెడ్యూల్ నాకు ఈ మార్కులు వచ్చేందుకు ఎంతగానో ఉపయోగపడ్డాయి.



స్కూల్ స్థాయి నుంచి కాకతీయలోనే చదివాను..

త్రిష చౌదరి (ఎంపీసీ, 991/1000)

ప్రతీరోజు 12 గంటల పాటు కష్టపడి చదవడం వల్లే బైపీసీలో రాష్ట్రస్థాయిలో మూడవ ర్యాంకు సాధించగలిగాను. యాజమాన్యం పక్కా ప్రణాళిక, అన్ని వేళల అందుబాటులో ఉండడం వల్లే నేను ఈ ర్యాంక్ సాధించా..



రాష్ట్రస్థాయిలో ర్యాంకులతో సత్తాచాటిన ఎస్ఆర్ విద్యార్థులు


రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించిన ఎస్ఆర్ డీజీఎం గోవర్ధన్‌రెడ్డి


ఎం.వైష్ణవి (438/440)


ఎస్.దినేష్ (468/470)

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ఫలితాలలో ఎస్ఆర్ విద్యాసంస్థల విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారు. మంగళవారం విడుదలైన ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాలలో ఎస్ఆర్ విద్యార్థులు రాష్ట్రస్థాయి మార్కులు సాధించి మరోసారి సత్తా చాటారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీ విభాగంలో ఏ.హర్షిణి 468/470, ఎన్.దినేష్ 468/470, శ్రీజ 468/470, శ్రీనిధిరెడ్డి 468/470, కె.సంజన 467/470, ఎం.హరిణి 467/470, జి.రాజశ్రీ 467/470, డి.వర్షిత్ 467/470, అఖిలేష్ 467/470, హిమశ్రీ 467/470 మార్కులు సాధించారు. ప్రథమ సంవత్సరం బైపీసీలో ఎం.వైష్ణవి 438/440, కె.వైష్ణవి 437/440 మార్కులు సాధించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీలో దొంతుల కీర్తి 993/1000, పి.సాయిశ్రీ 991/1000, జి.గౌతమ్ 991/1000, ఎస్.సహస్రరెడ్డి 990/1000, జె.రాణి 990/1000, బైపీసీలో డి.వైష్ణవి 993/1000, తహూరా ఫాతిమా 992/1000, ఎం.హన్సిక 990/1000, కె.రిద్ధి 990/1000 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్రస్థాయి మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా తెలంగాణ, ఆంధ్ర డీజీఎం గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. గత 11 సంవత్సరాల క్రితం ప్రారంభించిన ఎస్ఆర్ కళాశాల విద్యార్థులు అప్పటి నుంచి ఇప్పటి వరకు యదావిధిగా జిల్లా, రాష్ట్రస్థాయి మార్కులతో ప్రతిభ సాధిస్తున్నారని అన్నారు.

గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అత్యుత్తమ ఫలితాలు వచ్చే విధంగా అకాడమిక్ క్యాలెండర్‌ను రూపొందించి సీనియర్ అధ్యాపకులచే విద్యా బోధన, వీక్లీ టెస్టులు నిర్వహించడం వల్లే ఈ స్థాయి మార్కులు వచ్చాయని అన్నారు. రాబోయే నీట్‌లో కూడా ఎంబీబీఎస్ సీటు సాధించి జిల్లా కీర్తిని నిలబెడతామన్నారు. జోనల్ ఇంచార్జ్ శ్రీకాంత్ మాట్లాడుతూ ఎస్ఆర్ విద్యాసంస్థలో అనుభవజ్ఞులైన అధ్యాపకులతో ఆబ్జెక్టివ్‌కు సంబంధించి ఎప్‌సెట్, జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్, నీట్ కోచింగ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇటీవల ప్రకటించిన జేఈఈ మెయిన్స్ ఫలితాలలోనూ ఎస్ఆర్ విద్యార్థులు జాతీయ స్థాయి ర్యాంకులు సాధించారని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్స్ హన్మంత్‌రావు, అగేందర్‌రెడ్డి, సత్యం, శ్రీధర్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, మురళి, నర్సింహారెడ్డి, అకౌంట్ ఆఫీసర్ రమేష్‌రెడ్డిలు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాలలో బోధన్ విద్యార్థులకు అత్యుత్తమ ర్యాంకులు


నితిన్ విజయసాయి


పవిత్ర (బైపీసీ) విజేత కళాశాల, బోధన్

బోధన్‌రూరల్, ఏప్రిల్22 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరం పరీక్ష ఫలితాలలో బోధన్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించారు. ఎంపీసీలో 468/470మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో నిలిచారు. బోధన్ ఉషోదయ కళాశాలకు చెందిన కే.హర్షిత ఎంపీసీలో 468/470మార్కులు సాధించింది. విజయసాయి జూనియర్ కళాశాలలో కే.ప్రశాంత్ అనే విద్యార్థి ఎంపీసీలో 468/470మార్కులు సాధించాడు. ఎంపీసీలో 468/470మార్కులు సాధించారు. దీంతో మూడు కళాశాలల్లోని విద్యార్థులు రాష్ట్రస్థాయిలో విజేతలుగా నిలిచారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో ఉషోదయ కళాశాలకు చెందిన ఎంపీసీ సెకండ్ ఇయర్ విద్యార్థిని హర్షిత 995/1000మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించింది. సీహెచ్ పూజిత అనే విద్యార్థిని 993/1000మార్కులు ఎంపీసీలో సాధించి రాష్ట్ర స్థాయిలో విజేతగా నిలిచింది. బైపీసీ విభాగంలో బోధన్ విజేత జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థిని పవిత్ర 994/1000మార్కులు సాధించి రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించింది.

'నారాయణ' విద్యార్థుల విజయభేరి


లవంగ వైష్ణవి (నారాయణ)


నిశాంత్‌రెడ్డి (వెక్టర్)

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వినాయక్ నగర్‌లో గల నారాయణ జూనియర్ కళాశాల విద్యార్థులు మంగళవారం విడుదలైన ఇంటర్ ఫలితాలలో విజయభేరి మోగించారు. కళాశాలకు చెందిన విద్యార్థిని అంబాటి శ్రావణి ద్వితీయ సంవత్సరం ఎంపీసీ లో 993/1000, లవంగ వైష్ణవి 990/1000, ప్రథమ సంవత్సరం ఎంపీసీ లో గండ్ల వరుణ్ 468/470, బైపీసీలో అయేషా అఫీఫా 438/440 మా ర్కులు సాధించినట్లు నిజామాబాద్ ఏజీఎం లక్ష్మరెడ్డి తెలిపారు. ఇటీ వల విడుదలైన జేఈఈ మెయిన్స్ ఫలితాలలోనూ నారాయణ విద్యార్థు లు ఉత్తమ ఫలితాలు సాధించారని కళాశాల స్థాపించిన మూడు సంవత్సరాలలోనే రాష్ట్రస్థాయి మార్కులు సాధించడం ఆనందంగా ఉందన్నా రు. ప్రిన్సిపాల్ రవిగౌడ్, ఏవో శేఖర్, ప్రసాద్, శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

ఉత్తమ మార్కులు సాధించిన వెక్టర్ విద్యార్థులు..

నగరంలోని వినాయక్‌నగర్‌లో గల వెక్టర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాలలో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారు. ఎంపీసీ ప్రథమ సంవత్సరం ఫలితాలలో కళాశాలకు చెందిన గౌరవ్‌శర్మ 466/470, మణిచంద్ర 466/470, బత్తుల వంశీ 466/470, పోతుల ఆశ్రిత 466/470, మనస్విని 466/470, ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో నిశాంత్‌రెడ్డి 991/1000, బైపీసీలో శ్రీవర్షిణి 989/1000 మార్కులతో రాష్ట్రస్థాయి మార్కులు సాధించారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ మధుసూధన్‌జోషి, డైరెక్టర్‌లు గజానన్, సంతోష్, కార్తీక్‌లు విద్యార్థులను అభినందించారు. ఇటీవల విడుదలైన జేఈఈ మేయిన్స్ ఫలితాలలోను తమ కళాశాల విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు ఆయన తెలిపారు.


నగరంలోని గౌతంనగర్‌లో సన్నబియ్యం లబ్ధిదారుడి ఇంట్లో భోజనం చేస్తున్న పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్

సన్నబియ్యం లబ్ధిదారుడి ఇంట్లో భోజనం చేసిన పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేస్తున్న సన్నబియ్యం లబ్ధిదారుని నివాసంలో మంగళవారం ఎమ్మెల్సీ, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ భోజనం చేశారు. నగరంలోని గౌతంనగర్‌లో సన్నబియ్యం లబ్ధిదారుడు నరేందర్, లక్ష్మి నివాసంలో కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ధనవంతులతో సమానంగా పేదలకు కూడా సన్నబియ్యం తినాలనే ఉద్దేశ్యంతో రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తుందని ఇది దేశంలో ఏ రాష్ట్రంలో లేని పథకం అన్నారు. ప్రతీ లబ్ధిదారుడు ఈ పథకాన్ని వినియోగించుకోవాలన్నారు. ఆయనతో పాటు రైతు కమిషన్ మెంబర్ గడుగు గంగాధర్, నుడా చైర్మన్ కేశవేణు, నాయకులు రత్నాకర్, శివచరణ్, విపుల్‌గౌడ్ పాల్గొన్నారు.

ప్రతి పల్లెనూ అభివృద్ధి చేస్తాం : ఎమ్మెల్యే భూపతిరెడ్డి


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

ఇందల్వాయి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 15 నెలల్లోనే గ్రామీణ ప్రాంతాలను ఎంతో అభివృద్ధి చేశామని రానున్న రోజుల్లో ప్రతి పల్లెను సస్యశామలం చేస్తామని రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. మండలంలోని ఇందల్వాయి, రూప్లానాయక్ తాండా, తేవితాండా, గంగారాం తాండా, మేగ్యానాయక్ తాండా, సిర్నాపల్లి, నల్లవెల్లి, గౌరారం, తదితర గ్రామాల్లో 15కోట్ల 66లక్షల 37వేల రూపాయలతో పలు అభివృద్ధి పనులకు మంగళవారం శంకు స్థాపనలు నిర్వహించారు. ఇందల్వాయిలో 97లక్షల 69వేలు, రూప్లానాయక్ తాండాలో 31లక్షల 49వేలు, దేవితాండాలో 38లక్షల 52వేలు, గంగారాం తాండాలో 90లక్షల 57వేలు, మేగ్యానాయక్ తాండాలో 25లక్షలు, సిర్నాపల్లిలో 3కోట్ల 70లక్షల 62వేలు, నల్లవెల్లిలో 6కోట్ల 17లక్షల 54వేలు, గౌరారంలో 2కోట్ల 94లక్షల 94వేల రూపాయలతో సీసీ రోడ్లు, పంచాయతీ భవనాలు, చెక్‌డ్యామ్‌లు, బీటీ రోడ్డు మరమ్మతులు, డ్రైనేజీ నిర్మాణాలు తదితర అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాట్లాడుతూ.. ప్రతి పల్లెను అభివృద్ధి చేసే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందడుగు వేస్తుందని గత పదేళ్లలో బీఆర్ఎస్ చేసింది ఏమీ లేదని రాష్ట్రాన్ని అప్పులపాలు చేసింది తప్ప అభివృద్ధి చేయలేదన్నారు. ఇందిరమ్మ ప్రజాపాలనలో రేషన్ కార్డులు, సన్నాలకు బోనస్, భూభారతి కొత్త చట్టం లాంటి సంక్షేమ పథకాలు ఏ రాష్ట్రంలో లేవన్నారు. ఒకకోటి 30లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతులకు మద్దతు ధర కల్పించి ప్రభుత్వమే కొంటుందని అన్నారు. వరి ధాన్యం నానిన రంగు మారిన ప్రభుత్వమే కొంటుందన్నారు. రానున్న రోజుల్లో రైతును రాజును చేయాలనేది ప్రభుత్వ లక్ష్యం అన్నారు. రూరల్ ఎమ్మెల్యేకు ఆయా గ్రామాల ప్రజలు ఘనస్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్పగంగారెడ్డి, పార్టీ అధ్యక్షుడు నవీన్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ రూరల్ అధ్యక్షుడు సంతోష్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఒడ్డె రాజు, కొరట్‌పల్లి ఆనంద్, సొసైటీ చైర్మన్ నోముల శ్రీనివాస్‌రెడ్డి, కాంట్రాక్టర్లు పూర్యానాయక్, సంతోష్‌రెడ్డి, డీసీసీ డెలిగేట్ సుధాకర్ పాల్గొన్నారు.

తండ్రి హెడ్‌కానిస్టేబుల్.. కొడుకు ఐఏఎస్ !

● డిచ్‌పల్లి హెడ్‌కానిస్టేబుల్ కుమారుడు సాయి చైతన్యకు సివిల్స్‌లో 68వ ర్యాంకు

● అభినందించిన రాష్ట్ర డీజీపీ, సీపీ



డిచ్‌పల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌కు చెందిన గిరిజన యువకుడు సాయిచైతన్య జాదవ్ యూపీఎస్సీ పరీక్షల్లో ప్రతిభ కనబరిచి ఆల్ ఇండియాలో 68వ ర్యాంకు సాధించి ఐఏఎస్ ఉద్యోగానికి ఎంపికయ్యారు. సాయి చైతన్య తండ్రి జాదవ్ గోవింద్ నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి పోలీసు స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. తల్లి కవిత ప్రభుత్వ ఉపాధ్యాయురాలు. సాయి చైతన్య ఐదవ ప్రయత్నంలో యూపీఎస్సీ పరీక్షలో 68వ ర్యాంకు సాధించారు. గతంలో నాలుగో ప్రయత్నంలో 138వ ర్యాంకు సాధించి ఐఎఫ్ఎస్‌కు ఎంపిక కాగా.. తాజాగా ఐదవ ప్రయత్నంలో ఐఏఎస్ సాధించడంతో తల్లిదండ్రులతో పాటు బంధుమిత్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా.. సివిల్స్‌లో ర్యాంక్ సాధించిన సాయి చైతన్యను, అతని కుటుంబసభ్యులను రాష్ట్ర డీజీపీ జితేందర్, నిజామాబాద్ పోలీసు కమిషనర్ సాయి చైతన్యలు ప్రత్యేకంగా అభినందించారు.

ఆనందంగా ఉంది : సాయి చైతన్య తండ్రి



తమ కుమారుడు సాయిచైతన్య ఐఏఎస్‌కు ఎంపిక కావడం ఆనందంగా ఉందని సాయిచైతన్య తండ్రి, డిచ్‌పల్లి పీఎస్ హెడ్ కానిస్టేబుల్ గోవింద్ జాదవ్ అన్నారు. ఎంతో పట్టుదలతో తమ కుమారుడు సివిల్స్‌లో 68వ ర్యాంకు సాధించడం తమకెంతో గర్వ కారణంగా ఉందన్నారు.

చికెన్ ధరలు





రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.150	రూ.270	రూ. 300
వెన్‌కాబ్(కిలో)	: రూ.160	రూ.280	రూ. 310

బంగారం ధరలు



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.1,01,200	రూ.94,300	రూ.1020

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : అర్జున్ సన్‌ఆఫ్ వైజయంతి (10.00, 1.00, 4.00, 7.00, 10.00)
స్క్రీన్-2 : ఓదెల-2 (10.00, 1.05, 4.10, 7.15, 10.20)
స్క్రీన్-3 : పడ్డింగ్టన్ ఇన్ పేరు (హిందీ) (11.05)
: జాట్ (హిందీ) (1.30)
: సిన్నర్స్ (ఇంగ్లీష్) (4.40, 7.40, 10.40)
స్క్రీన్-4 : డియర్ ఉమా (11.00)
: ది చూసెన్ లాస్ట్ సుప్పర్ (ఇంగ్లీష్) (2.10, 7.40)
: జాక్ (4.45)
: పడ్డింగ్టన్ ఇన్ పేరు (హిందీ) (10.20)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : ఓదెల-2 (10.40, 1.30, 4.30, 7.20, 10.20)
స్క్రీన్-2 : అర్జున్ సన్‌ఆఫ్ వైజయంతి (11.00, 1.35, 4.30, 7.25, 10.20)
స్క్రీన్-3 : గుడ్ బ్యాడ్ అగ్లీ (11.00, 10.40)
: ఒక్కడు (1.40, 7.40)

లలితామహల్ : జాక్ (11.15, 2.15, 6.15, 9.15)
దేవి : అర్జున్ సన్‌ఆఫ్ వైజయంతి (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : జాట్ (హిందీ) (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : ఓదెల-2 (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్